## అధ్యాయము 30

# లేయా మరియు రాహేలు మధ్య శత్రుత్వం

మొదటి భాగమైన 30వ అధ్యాయములో పిల్లలను కని ఆయన మెప్పు పొందాలనే పందెం యాకోబు భార్యల మధ్య కొనసాగింది. ఈ జగడం ఒక పెద్ద కుటుంబమును కట్టుటకు దారి తీసింది (29:31–30:24). మిగతా అధ్యాయము యాకోబు ఏవిధంగా గొర్రెలను మరియు మేకల మందలను బట్టి సంపన్నుడాయెనో తెలియజేస్తుంది (30:25–43). "ఆ ప్రకారము ఆ మనుష్యుడు అత్యధికముగా అభివృద్ధిపొంది విస్తారమైన మందలు దాసీలు దాసులు ఒంటెలు గాడిదలు గలవాడాయెను" అను దానితో ముగుస్తుంది (30:43).

### రాహేలు యొక్క దాసీ కుమారులు (30:1–8)

**1రాహేలు తాను యాకోబునకు పిల్లలు కనక పోవుట చూచి తన అక్కయందు
అసూయపడి యాకోబుతో-నాకు గర్భఫలము నిమ్ము; లేనియెడల నేను
చచ్చెదననెను. 2యాకోబు కోపము రాహేలు మీద రగులుకొనగా అతడు-నేను నీకు
గర్భఫలమును ఇయ్యకపోయిన దేవునికి ప్రతిగా నున్నానా అనెను. 3అందుకామె-
నా దాసియైన బిల్హా ఉన్నది గదా; ఆమెతో పొమ్ము; ఆమె నా కొరకు పిల్లలను కనును;
ఆలాగున ఆమె వలన నాకును పిల్లలు కలుగుదురని చెప్పి 4తన దాసియైన బిల్హాను
అతనికి భార్యగా ఇచ్చెను. యాకోబు ఆమెతో పోగా 5బిల్హా గర్భవతియై యాకోబునకు
కుమారుని కనెను. 6అప్పుడు రాహేలు- దేవుడు నాకు తీర్పు తీర్చెను; ఆయన నా
మొరను విని నాకు కుమారుని దయచేసెననుకొని అతనికి దాను అని పేరు పెట్టెను.
7రాహేలు దాసియైన బిల్హా తిరిగి గర్భవతియై యాకోబుకు రెండవ కుమారుని కనెను.
8అప్పుడు రాహేలు- దేవుని కృప విషయమై నా అక్కతో పోరాడి గెలిచితిననుకొని
అతనికి నఫ్తాలి అను పేరు పెట్టెను.**

**వచనము 1.** ఈ సంఘటన ముందు అధ్యాయములోని చివరి సన్నివేశంతో

కలిసిపోయి ఉన్నది ఎందుకంటే, ఈ రెండు చోట్ల రాహేలు యొక్క గొడ్రాలి తనమును లేఖనము సూచిస్తుంది. రెండు విభాగాలు కూడా కనిపించేది ఏదో సూచిస్తాయి (గ్రహిస్తాయి). “లేయా ద్వేషింపబడుట” మరియు గర్భం ధరించే స్థితిలో లేకపోవుట యెహోవా చూచి, “ఆమె గర్భం తెరచెను” మరియు కనుటకు సహాయము చేసెను (29:31). ఈ సన్నివేశంలో, లేయా వలె నేను **యాకోబుకు పిల్లలను** కనకపోయెను అని **రాహేలును చూచెను.** అందుచేత, **ఆమె తన అక్కయందు అసూయపడెను**[1] మరియు తన భర్త తో **నాకు గర్భఫలము నిమ్ము; లేనియెడల నేను చచ్చెదననెని** చెప్పెను. రాహేలు యొక్క అసూయకు కారణం పురాతన సంస్కృతిలో గొడ్రాలులకు సాంఘికపరముగా కలుగు అవమానములో పాతుకుని ఉన్నది (30:23; 1 సమూయేలు 1:11–18). బిడ్డల్ని కనడం అనేది ఒక ప్రత్యేకమైన చర్య. అది స్త్రీ జీవితంలో ఆత్మగౌరవం, అర్థం మరియు జీవిత ఉద్దేశమును ఇస్తుంది. మరణం గూర్చిన ఆమె ప్రకటన అనేది విచారమును మరియు పరితాపమును అతిగా తెలియజేసి ఆమె యొక్క గొడ్రాలి తనం గూర్చి తన భర్తను నిందించడం. ఆమె కోపం హృదయవేదన కలిగించేది మరియు వ్యంగ్యమైనది: బిడ్డకు జన్మనివ్వకపోతే చచ్చెదనని చెప్పెను; కనీ, సంవత్సరాల తరువాత, ఆమెకు రెండవ కుమారుడు జన్మించినప్పుడు ప్రసవవేదనలో మరణించెను (35:16–19).

**వచనము 2.** యాకోబుకు రాహేలుపై లోతైన ప్రేమ కలదు మరియు ఆమె నిరాశ భావాలకు అతను సున్నితంగా ఉన్నాడు, ఎందుకంటే ఆమె గర్భం ధరించలేనిదిగా ఉన్నది. అయితే, ఈ సన్నివేశంలో, రాహేలుకు కోపంగా మరియు మనోవైఫల్యతో స్పందించాడు. ఎందుకంటే, ఆమె పిల్లలులేని పరిస్థితికి ఆయనను తప్పుగా పరిగణించింది. **నేను నీకు గర్భఫలమును ఇయ్యకపోయిన దేవునికి ప్రతిగా నున్నానా?** అని అతడు చెప్పెను. ఇది ఒక అలంకారిక ప్రశ్న (సమాధానం అవసరం లేని) మరియు గద్దింపు ప్రశ్న. గర్భం తెరచే మరియు మూసే శక్తి దేవునికి ఉన్నట్లు యాకోబుకు లేదు. యాకోబు తన భార్యకు పిండోత్పత్తి కలిగించే సామర్థ్యం కలిగి ఉన్నాడు, కానీ రాహేలు అడిగిన దానిని ఇచ్చే శక్తి లేదు. దేవుడు గర్భములను తెరచెను మరియు మూసెను అని ఆదికాండములో చెప్పబడిన అనేక వాక్యములను యాకోబు తిరస్కరణ అంగీకరిస్తుంది (4:1, 25; 16:2; 17:16; 18:10–14; 20:17, 18; 21:1, 2; 25:21; 29:31; 30:6, 17, 22).

**వచనము 3.** ఈ సమయానికి, దేవుడు తన తరుపున వ్యవహరించి ప్రసవం ద్వారా సహజ పిల్లలను ఇస్తాడనే నిరీక్షణను రాహేలు విడిచిపెట్టినట్లు కనిపిస్తుంది. పశ్చిమ ఆసియా సంప్రదాయ ప్రకారముగా శారా హాగరును ఏర్పాటు చేసికొన్న విధంగా (16:1–4), ఆమె కూడా పిల్లల్ని కనుటకు స్త్రీని ఎన్నుకొనెను. తన వ్యక్తిగత దాసికి పుట్టిన పిల్లలకు చట్ట ప్రకారంగా రాహేలే తల్లి; కాబట్టి యాకోబుతో ఇలా **చెప్పెను, నా దాసియైన బిల్హా ఉన్నది గదా; ఆమెతో పొమ్ము; ఆమె నా కొరకు పిల్లలను కనును; ఆలాగున ఆమె వలన నాకును పిల్లలు కలుగుదురు.** నా కొరకు

పిల్లలను కనును అను వాక్యము చిహ్నాత్మకంగా ఇలా చెప్పబడింది, నవశిశువును తన సొంత శిశువుగా అంగీకరించు వ్యక్తి యొక్క ఒడిలో ఆ శిశువును తీసుకొని పెళ్లి పెట్టాలి మరియు ఆ వ్యక్తి శిశువును తన సొంత శిశువుగా అంగీకరిస్తుంది (50:23; 48:5, 12 చూడండి). పురాతన సంప్రదాయం ప్రకారముగా, బిల్హాకు పిండోత్పత్తి కలిగించమని తద్వారా ఆమె బిడ్డను తీసుకుని చట్టప్రకారముగా తల్లి అగుటకు రాహేలు యాకోబును ప్రోత్సహించెను.

**వచనము 4, 5.** రాహేలు ప్రతిపాదనకు యాకోబు నిరాకరించలేదు; గనుక **తన దాసియైన బిల్హాను అతనికి భార్యగా ఇచ్చెను, యాకోబు ఆమెతో పోయెను.** పితరుల కాలంలో "భార్య" మరియు "ఉంపుడు గత్తె" అను పదములు పరస్పరంగా వాడబడేవి. ముగ్గురు స్త్రీలకు ఈ రెండు బిరుదులు ఇవ్వబడినవి: హాగరు (16:3; 25:6 చూడండి), కెతూర (25:1; 25:6; 1 దినవృత్తాంతములు 1:32) మరియు బిల్హా (30:4; 35:22). ఈ ఉంపుడు గత్తెలు అబ్రాహాముకు మరియు యాకోబుకు ద్వితీయ భార్యలుగా చెప్పబడ్డారు; మరియు వీరు పితరుల దొరసానులైన భార్యల యొక్క అధీనంలో ఉండేవారు. పితరుల కాలం తరువాత, "భార్య" మరియు "ఉంపుడు గత్తె" అను పదాలు పరస్పరం వాడడం మానివేశారు. బిల్హా వలె ఆమె అదే సామాజిక స్థితి కలిగియున్నను, ఆదికాండము జిల్పాను ఉంపుడుగత్తెగా చెప్పలేదు (30:9; 37:2). రాహేలు ప్రేరేపణ ప్రకారం, బిల్హా యాకోబుకు ఉపరి భార్యగా అయ్యింది; మరియు ఆమెతో లైంగిక సంబంధం కలిగియున్నాడు గనుక **గర్భవతియై** (ఆయనకు) **కుమారుని కనెను.**

**వచనము 6.** అబ్రాహాము భార్యయైన శారా వలె కాకుండా (16:5, 6; 21:9–13), **రాహేలు** తన దాసి ద్వారా పుట్టిన కుమారుని చూచి చాలా ఆనందించెను. దేవుని తీర్పుగా ఆమె దానిని చూచెను. **దేవుడు నాకు తీర్పు తీర్చెను; ఆయన నా మొరను విని నాకు కుమారుని దయచేసెను** అని చెప్పెను. ఈ వాక్యము ఇలా సూచిస్తుంది, రాహేలు కుమారుని కొరకు దేవుని ప్రార్థించుచుండెను, బిల్హా ఆయనను కనినప్పుడు, దేవుడు తన మొర ఆలకించి తన విన్నపమునకు స్పందిచినదానిని బట్టి స్తుతించెను. ఇస్సాకు రిబ్కా కొరకు విజ్ఞాపన చేసినట్లు (25:21) చూపించిన రచయిత రాహేలుకు బదులుగా యాకోబు విజ్ఞాపన చేయడం చెప్పలేదు, తన భార్యకు బదులుగా చేసే విజ్ఞాపన విలువ గూర్చి యాకోబు ఇంకా నమ్మలేదు అని పాఠకులు ఆశ్చర్యపోవచ్చు.

బిల్హా కేవలం సర్రోగేట్ తల్లి వలె పనిచేసెను. బిడ్డ చట్ట ప్రకారంగా రాహేలుకు చెందినది, కాబట్టి ఆమె అతనికి పేరు నిచ్చుటకు తగినది. **అతనికి దాను అని పేరు పెట్టెను,** ఇది "తీర్పు తీర్చు" (דִּין, *din*) లేదా "న్యాయం" అను పదం నుండి కలిగినది.[2] పాత నిబంధన గ్రంథములో దేవుడు రాజ్యములను తీర్పు తీర్చడమును గూర్చు (15:14; యోబు 36:31; కీర్తనలు 7:8; 9:8; 96:10) మరియు పేదవారికి, అవసరతలో ఉన్నవారికి మరియు నీతిమంతులకు న్యాయము తీర్చుటను గూర్చి

వివరించబడినది (1 సమూయేలు 24:15; కీర్తనలు 68:5; 76:9; 140:12). ఈ కుమారుని జననము కేవలం దేవుని యొక్క దీవెన అని అనుకోలేదు; న్యాయమునకు ఋణము వలె ఆమె దానిని చూచింది ఎందుకంటే ఆమె నిస్సహాయమైన గొడ్రాలు.

**వచనము 7, 8.** కొంత కాలం తరువాత, రాహేలు దాసియైన బిల్హా తిరిగి గర్భవతియై యాకోబుకు రెండవ కుమారుని కనెను. మరలా రాహేలు ఆనందించెను. నఫ్తాలి అని పిలచి, ఇలా వివరించెను "దేవుని కృప విషయమై నా అక్కతో పోరాడి గెలిచితిని."[3] "శక్తివంతంగా పోరాడడం" అని అనువదించబడిన హెబ్రీ వ్యక్తీకరణం అక్షరార్ధంగా "దేవునితో పోరాడడం" అని అర్థం. "నఫ్తాలి" అను పేరు "పోరాడడం" (נַפְתּוּלִים, *napthulim*) అను నామవాచకం వలె ఉంటుంది. "దేవుడు" అను మాటకు ఇక్కడ పదమేమిటంటే אֱלֹהִים (*'Elohim*); కానీ ఇక్కడ పదప్రయోగంలో దీనిని వివరణాత్మక రూపంలో, అర్థం చేసుకోవాలి, ఏమిటంటే "సర్వశక్తి" లేదా "గొప్ప" వంటిది.[4] రాహేలు తన జీవిత అనుభవమును లేయాతో పోటీగా పరిగణించింది; మరియు ఇప్పుడు ఆమె చట్టరీత్యా నఫ్తాలి తల్లి గనుక ఆ పందెంలో గెలుచుచున్నదిగా చెప్పింది.

## లేయా యొక్క దాసి కుమారులు (30:9–13)

**9లేయా తనకు కానుపు ఉడుగుట చూచి తన దాసియైన జిల్పాను తీసికొని యాకోబునకు ఆమెను భార్యగా ఇచ్చెను. 10లేయా దాసియైన జిల్పా యాకోబునకు కుమారును కనగా 11లేయా- ఇది అదృష్టమేగదా అనుకొని అతనికి గాదు అను పేరుపెట్టెను. 12లేయా దాసియైన జిల్పా యాకోబునకు రెండవ కుమారుని కనగా 13లేయా నేను భాగ్యవంతురాలను- స్త్రీలు నన్ను భాగ్యవతి అందురు గదా అని అతనికి ఆషేరు అను పేరు పెట్టెను.**

**వచనము 9.** 29:35 మరలా చేపబడిన, **లేయా తనకు కానుపు ఉడుగుటను** గ్రహించుటతో ఈ కథనము కొనసాగింపబడినది. పోటీపడుతున్న సోదరీమణుల (30:1–8, 9–13) యొక్క దాసీల ద్వారా కలిగిన పిల్లలు వెంట వెంటనే కాకుండా ఒకే కాలంలో జరిగినట్లుగా సూచిస్తుంది. రాహేలు వాడిన పథకమును **లేయా** కూడా ఉపయోగించాలనుకున్నది. లేయా **తన దాసియైన జిల్పాను** తన భర్తయైన **యాకోబుకు** ఉపరి **భార్యగా** ఇవ్వాలని అనుకొనెను.

**వచనములు 10, 11.** బిల్హా వలె (30:4, 5) **జిల్పా** గర్భం ధరించి **యాకోబునకు కుమారుని కనుటకు** కష్టమేమి కలుగలేదు. దీనితో, **లేయా** ఇలా చెప్పింది, **ఇది అదృష్టమేగదా** [בְּגָד, $b^e$*gad*]! ఆమె ఇలా అనినట్లు NIV చెప్తుంది, "ఏమి అదృష్టం!" పదజాలమును ఉపయోగించి లేయా **గాదు అను పేరు పెట్టెను.** "గాదు" అనునది తరువాత ప్రవక్తల సాహిత్యములో దేవుని పేరు. "యెహోవాను విసర్జించి నా పరిశుద్ధ

పర్వతమును మరచి గాదునకు బల్లలను స్థిరపరచువారలారా ... మీరందరూ వధకు లోనగుదురు" అని యెషయా 65:11, 12a చెప్తుంది. కొంతమంది ఆ అర్థమును ఇక్కడ ఉపయోగిస్తారు; అయితే, కుమారుని ఇచ్చిన ఈ దీవెనను లేయా అన్యుల దేవునికి సంబోధించినట్లు ఎక్కడా కూడా చెప్పబడలేదు. విరుద్ధంగా, ఈ జననమును లేయా "అదృష్టం" లేదా "భాగ్యము" గా పరిగణించింది. వాస్తవానికి, NJPSVలో "ఏమి అదృష్టం" అని ఉంది.

**వచనములు 12, 13. లేయా దాసియైన జిల్పా యాకోబునకు రెండవ** కుమారుని కనగా **లేయా ఇలా చెప్పెను, నేను భాగ్యవంతురాలను- స్త్రీలు నన్ను భాగ్యవతి** [אָשַׁר, *'ashar*] **అందురు.** ఈ వ్యక్తీకరణము ఒక సామాజిక సందర్భమును సూచిస్తుంది: జిల్పా ద్వారా పుట్టిన మరో కుమారునికి చట్టరీత్యా తల్లిగా ఉన్న లేయాను భాగ్యవంతురాలా అని అందరు స్త్రీలు అందురు. న్యాయాధిపతుల కాలంలో, రూతూ ద్వారా పుట్టిన ఒబేదు వలన నయోమి పై బెత్లెహేము స్త్రీలు ఆశీర్వచనము పలికెను: "ఆ దినమున నీకు బంధువుడు లేకుండ చేయని యెహోవా స్తుతినొందుగాక; ఆయన నామము ఇశ్రాయేలీయులలో ప్రకటింపబడునుగాక ..." (రూతూ 4:14b, 15). ఈ కుమారునిపై ఆనందమును బట్టి **అతనికి ఆషేరు అని పేరు పెట్టెను,** అంటే "సంతోషం" లేదా "ధన్యత" అని అర్థం (యోబు 29:11; కీర్తనలు 72:17; సామెతలు 31:28; పరమగీతము 6:9).[5] ఆమె ఇప్పుడు, చట్ట ప్రకారముగా, ఆరుగురు కుమారులకు తల్లి.

## పుత్రదాతవృక్ష ఫలము కొరకు బేరము మరియు లేయా యొక్క చిన్న పిల్లల జననం (30:14–21)

**[14]గోధుమల కోతకాలములో రూబేను వెళ్లి పొలములో పుత్రదాతవృక్షపు పండ్లు చూచి తన తల్లియైన లేయాకు తెచ్చి యిచ్చెను. అప్పుడు రాహేలు – నీ కుమారుని పుత్రదాతవృక్షపు పండ్లలో కొన్ని నాకు దయచేయుమని లేయాతో అనగా [15]ఆమె- నా భర్తను తీసుకొంటివే అది చాలదా? ఇప్పుడు నా కుమారుని పుత్రదాతవృక్షపు పండ్లను తీసికొందువా అని చెప్పెను. అందుకు రాహేలు-కాబట్టి నీ కుమారుని పుత్రదాతవృక్షపు పండ్ల నిమిత్తము అతడు ఈ రాత్రి నీతో శయనించునని చెప్పెను. [16]సాయంకాలమందు యాకోబు పొలమునుండి వచ్చునప్పుడు లేయా అతనిని ఎదుర్కొనబోయి-నీవు నా యొద్దకు రావలెను, నా కుమారుని పుత్రదాతవృక్షపు పండ్లతో నిన్ను కొంటినని చెప్పెను. కాబట్టి అతడు ఆ రాత్రి ఆమెతో శయనించెను. [17]దేవుడు లేయా మనవి వినెను గనుక ఆమె గర్భవతియై యాకోబునకు అయిదవ కుమారుని కనెను. [18]లేయా- నా పెనిమిటికి నా దాసి నిచ్చినందున దేవుడు నాకు ప్రతిఫలము దయచేసెననుకొని అతనికి ఇశ్శాఖారు అను పేరు పెట్టెను. [19]లేయా**

**మరల గర్భవతియై యాకోబునకు ఆరవ కుమారుని కనెను. [20]అప్పుడు లేయా- దేవుడు మంచి బహుమతిని నాకు దయచేసెను; నా పెనిమిటికి ఆరుగురు కుమారులను కనియున్నాను గనుక అతడికను నాతో కాపురము చేయుననుకొని అతనికి జెబూలూను అను పేరు పెట్టెను. [21]ఆ తరువాత ఆమె కొమార్తెను కని ఆమెకు దీనా అను పేరు పెట్టెను.**

**వచనము 14.** ఈ కథనము **గోధుమల కోతకాలముతో** ముందుకు కొనసాగుతుంది. చిన్నవాడైన రూబేను **పొలములో పుత్రదాతవృక్షప పండ్లు** చూచి **తన తల్లియైన లేయాకు తెచ్చి యిచ్చెను.** పుత్రదాతవృక్షం అనునది కాడ లేకుండా పెద్దదిగా, వేరు నుండే పచ్చని ఆకులు బయటకు పెరిగే ఒక మొక్క. ఆకుపచ్చ-తెలుపు లేదా ధూమ్రవర్ణము గల పుష్పాలు ఆకుల మధ్య నుండి వికసిస్తాయి మరియు ఆపిల్ లేదా రేగు వలె కనిపించే పసుపు-ఎరుపు పండును ఉత్పత్తి చేస్తుంది. ఇది ఆకర్షించే పరిమళమును ఇస్తుంది పురాతన ప్రజలు దీనిని ఒక నిరోధకంగా మరియు సంతానోత్పత్తి కలిగించేదిగా భావించేవారు.[6] పురాతన సాహిత్యంలో పుత్రవృక్షమును గూర్చి పలు సూచనలు ఉన్నప్పటికీ, బైబిల్లో మాత్రం ఇక్కడ మరియు శరీర సాన్నిహిత్యం గూర్చిన సందర్భంలో చెప్పబడిన పరమగీతము 7:13 లో మాత్రమే కనిపిస్తుంది.

రూబేను తన తల్లికి ఈ సువాసన గల కొన్ని పండ్లను తీసుకువచ్చాడు అని తెలుసుకున్న తరువాత, **రాహేలు** తంత్రముతో **లేయా** వద్దకు వెళ్లి ఇలా చెప్పెను, **నీ కుమారుని పుత్రదాతవృక్షపు పండ్లలో కొన్ని నాకు దయచేయుము.** ఈ వేర్లు గర్భం ధరించి జన్మనిచ్చే సామర్థ్యం ఇస్తాయని ఆ స్త్రీ అనుకున్నది.

**వచనము 15.** లేయా రాహేలుతో గట్టిగా మాట్లాడి, ఆమె నా **భర్తను** మాత్రమే దొంగిలించడం కాదు, గానీ తన **కుమారుని పుత్రదాతవృక్షపు పండ్లను** కూడా ఆశించింది అని చెప్పెను. జరిగేదానిని బట్టి చూస్తే ఏమి అర్థమౌతుందంటే, యాకోబుకు ప్రియమైన భార్యగా రాహేలుకు ప్రతి రాత్రి ఆయనతో ఏ భార్య పడుకోవాలో లేదా ఏ ఉంపుడు గత్తె పడుకోవాలో నిర్ణయించే హక్కు ఉందని తెలుస్తుంది. ఒక ప్రపంచంలో స్త్రీ యొక్క విలువ మరియు గౌరవం ప్రథమంగా తమ భర్తలకు కుమారులను ఇచ్చుటను బట్టి వస్తుంది, యాకోబు భార్యల మధ్యనున్న అసూయను కేవలం ఊహించవచ్చును. గర్భం ధరించుటకు తొందరపడి, **రాహేలు** లేయాతో ప్రమాణము చేసి, **నీ కుమారుని పుత్రదాతవృక్షపు పండ్ల నిమిత్తము అతడు ఈ రాత్రి నీతో శయనించునని చెప్పెను.**

**వచనము 16.** ఈ స్త్రీలు అతనికి పిల్లలను ఉత్పత్తి చేయుటకు పోటీపడుచున్న విషయంలో యాకోబు పూర్తిగా నిష్క్రియాత్మకంగా ఉన్నాడని ప్రకరణము సూచిస్తుంది. ఈ సంఘటనలో గల విరుద్ధార్థం నిర్లక్ష్యం చేయకూడదు: ఏశావును మరియు ఇస్సాకును మోసం చేసిన యాకోబు ఇంకను తన జీవితమంత

మోసమును అనుభవించడం కొనసాగించాడు. ఒక రోజు పని తరువాత యాకోబు **పొలమునుండి** వచ్చునప్పుడు, **లేయా అతనిని ఎదుర్కొనబోవుటను** చూచి బహుశా ఆశ్చర్యపడెను మరియు ఆయన తనతో ఆ రాత్రి శయనించవలెను. ఎందుకంటే, తన **కుమారుని పుత్రదాతవృక్షపు పండ్లతో** నిన్ను **కొంటిని** అని చెప్పిన మాటలు ఆయన వినినప్పుడు బహుగా ఆశ్చర్యపడి యుండవచ్చు. ఈ ఒప్పందం గురించి నమోదు చేయబడిన ప్రశ్నలేమీ లేకుండా, యాకోబు ఒప్పుకొనెను; **కాబట్టి అతడు ఆ రాత్రి ఆమెతో శయనించెను.**

**వచనము 17.** క్రింది వచనములలో, స్త్రీ యొక్క మూఢ నమ్మకం ఉన్నప్పటికీ, లేయా గర్భం ధరించుటకు పుత్రదాతవృక్ష పండ్లకు సంబంధం లేదని వాక్యం స్పష్టపరుస్తుంది. **దేవుడు** లేయా **మనవి వినెను,** గనుక **యాకోబునకు అయిదవ కుమారును కనుటకు** శక్తి ఇచ్చెను (29:31−35). మరలా విరుద్ధార్థం స్పష్టమైనది: లేయా పుత్రదాతవృక్ష పండ్లను విడచింది అయినను పిల్లలను కనడం కొనసాగించింది. రాహేలు పుత్రదాతవృక్ష పండ్లను తీసుకున్నది అయినను మూడు సంవత్సరాల వరకు గొడ్రాలు గానే మిగిలిపోయింది.

**వచనము 18.** మరొక కుమారుడు కలిగినందు వలన, లేయా ఆనందించి ఇలా చెప్పెను, "నా పెనిమిటికి నా దాసి నిచ్చినందున దేవుడు నాకు ప్రతిఫలము [שָׂכָר, *śakar*] దయచేసెను." అందుచేత, అతనికి ఇశ్శాఖారు అను పేరు పెట్టెను, పేరు పేరు అర్థాలనిచ్చే *śakar* ("వేతనాలు" లేదా "కిరాయి") అను పదము నుండి పుట్టింది; అంటే " (నా) వేతనాల వ్యక్తి" లేదా "కిరాయి మనిషి" అని అర్థం.

**వచనములు 19, 20. లేయా మరల గర్భవతియై యాకోబునకు ఆరవ**(మరియు చివరి) **కుమారుని కనెను.** మునుపటి వలె, **జెబూలూను** అని పేరు పెట్టుటకు దేవుడే కారణమని లేయా రెండు ఉదాహరణలను ఇచ్చెను. మొదట, ఆమె ఇలా చెప్పెను, **"దేవుడు మంచి బహుమతిని** [זֶבֶד, *zebed*, 'మాన్యము[7]'] **నాకు దయచేసెను** [זָבַד, *zabad*]." ఈ రెండు పదాలు పాత నిబంధనలో ఇక్కడ మాత్రమే కనిపిస్తాయి. లేయా బహుశా మరో పదజాలమును చేస్తుంది, ఎందుకంటే ఈ పదాలు "జెబూలూను" పేరులో నున్న రెండు హల్లులు (*zb*) కలిగియున్నది.

అదనంగా, ఆమె ఇలా చెప్పింది, **"నా పెనిమిటికి ఆరుగురు కుమారులను కనియున్నాను గనుక అతడికను నాతో కాపురము చేయును."** "కాపురము" అని అనువదించబడిన పదము זָבַל (*zabal*), మరో పదజాలం జెబూలూనులో మూడు హల్లులను (*zbl*) కలిగియున్నది. "కాపురము" అనునది పాత నిబంధన లో ఒకసారి మాత్రమే సంభవిస్తుంది ఇది హెబ్రీ పదమునకు మంచి భాషాంతరము కాదు. బదులుగా, వేరే అనువాదాలు "పొగడు" (NJPSV) లేదా "కీర్తి" (RSV; NRSV; NIV; ESV) ఉన్నవి. లేయాకు కావలసినది కలసి జీవించడం లేదా కాపురం చేయడం కాదు; తను నమ్మకస్తురాలుగా మరియు ఆయనకు కుమారులను కనిన దానిగా ఉన్నందుకు యాకోబు ఆమెను ప్రేమించి, గౌరవించి మరియు రక్షించాలని

కోరుకున్నది (29:34 చూడండి).

**వచనము 21.** కొంతకాలం తరువాత, లేయా చివరి కుమార్తెను కనెను. ఆమె **ఆమెకు దీనా** (דִּינָה, *Dinah*), **అని పేరు పెట్టెను,** ఇది "దాను"కు స్త్రీ రూపం. ఈ రెండు పేర్లు హెబ్రీ క్రియా పదమైన דִּין (*din*) నుండి వస్తాయి, అంటే "న్యాయం" లేయా "తీర్పు తీర్చడం" అని అర్థం. 30:6లో "దేవుడు నాకు తీర్పు తీర్చెను" అని చెప్పి రాహేలు తన దాసి మొదట కుమారునికి "దాను" అని పేరు పెట్టెను. 30:21లో, లేయా ఆ పేరు యొక్క పదజాలమును ఉపయోగించి తన కుమార్తెను "దీనా" అని పిలిచియుండవచ్చు. ఏడుగురు బిడ్డలను కనిన తరువాత, ఇంకను గొడ్రాలుగా నున్న తన సహోదరియైన రాహేలుకు ప్రతిగా ఆమె విడిపించబడినట్లుగా భావించియుండవచ్చు.

యాకోబుతో కూడా ఐగుప్తుకు "కుమార్తెలు" వెళ్లినట్లు వాక్యములో చెబుతున్నప్పటికీ (46:7, 15; 37:35చూడండి) ఆయన వంశావళిలో పేర్కొనబడినది ఆయన **కుమార్తెయైన** దీనా మాత్రమే (46:15). ఈ స్పష్టమైన వ్యత్యాసము ఎలా వివరించగలము? ఆ సందర్భంలో, బహువచనమైన "కుమార్తెలు" ఒక దీనాను మాత్రమే సూచిస్తాయి. ఎందుకంటే 46:23లో బహువచనమైన "కుమారులు" దాను యొక్క ఒకే వారసుడను సూచిస్తుంది. ఇంకొక అవకాశం ఏంటంటే, "కుమార్తెలు" అను పదము యాకోబు యొక్క కోడండ్లను సూచిస్తుంది (రూత 1:7, 11 చూడండి). అతి తక్కువ గల అవకాశం ఏమిటంటే వాక్యములో చెప్పబడని కుమార్తెలు యాకోబుకు ఉండియుండవచ్చును.[8]

ఈ భాగములో దీనా యొక్క ప్రస్తావన 34వ అధ్యాయములో జరుగు ఘోరమైన సన్నివేశాలకు సిద్ధపాటుగా ఉంది, మరియు ఇది ఆమె ఇద్దరు సోదరులైన షిమ్యోను మరియు లేవీలను యాకోబు తిరస్కరించుటకు దారి తీసింది (34:30, 31; 49:5–7).

## రాహేలు కుమారులు (30:22–24)

**[22]దేవుడు రాహేలును జ్ఞాపకము చేసికొని ఆమె మనవి విని ఆమె గర్భము తెరిచెను. [23]అప్పుడామె గర్భవతియై కుమారుని కని-దేవుడు నా నింద తొలగించెననుకొనెను. [24]మరియు ఆమె-యెహోవా మరియొక కుమారుని నాకు దయచేయునుగాక అనుకొని అతనికి యోసేపు అను పేరు పెట్టెను.**

**వచనము 22.** ఈ సంక్షిప్త సన్నివేశం రాహేలు యొక్క విషాదకరమైన గొడ్రాలుతనమును ముగిస్తుంది (29:31) మరియు **దేవుడు రాహేలును జ్ఞాపకముచేసికొనుటతో** పరిశీలన ముగుస్తుంది. ఇది మునుపటి ప్రకటనను గుర్తుచేస్తుంది: దేవుడు నోవహును జ్ఞాపకము చేసికొనెను (8:1; 19:29; నిర్గమ.

2:24; కీర్తనలు 106:45). ఆ సందర్భంలో, ఓడలో నున్న వారి తరపున దేవుడు స్పందించి, నీరు తగ్గిపోయేట్లు చేసెను. అదే విధంగా, "దేవుడు రాహేలును జ్ఞాపకము చేసికొనెను" అని రచయిత చెప్పినప్పుడు, దేవుడు ఆమె అవసరతలకు స్పందించెను అని అర్థము. ఆయన **ఆమె** (మనవి) **విని ఆమె గర్భము తెరిచెను.**

**వచనము 23.** దేవుని కార్యమునకు ఫలము ఏమనగా ఆమె **గర్భవతియై కుమారుని కనెను.** రాహేలు గర్భం ధరించుటలో మరియు బిడ్డను కనుటలో దేవుడు వ్యక్తిగతంగా ఉన్నాడనుటకు ఇది ఇంకొక ధృవీకరణం. ఆమె గర్భం ధరించుటకు కారణం పుత్రదాతవృక్ష ఫలము వాసన చూడడం వలన కాదు.

ఆమె కుమారుని పుట్టుకతో, రాహేలు ఈ విధంగా చెప్పింది, **దేవుడు నా నింద తొలగించెననుకొనెను.** "నింద" (חֶרְפָּה, *cherpah*) అను పదము "అవమానం" (NIV; NJPSV), "సిగ్గు" (NCV), లేదా "కించపరచడం" గా (NEB; REB) కూడా అనువదించవచ్చు. గోడ్రాలైనందున ఈమె సంవత్సరాల తరబడి సామాజికంగా అవమానించబడింది.

**వచనము 24.** రాహేలు తన కుమారునికి **యోసేపు** (יוֹסֵף, *Yosep*), **అను పేరు పెట్టెను,** దానికి "జోడించు", "పెంచు" లేదా "మరల చేయు" అని అర్థం.[9] అప్పుడు ఆమె బిడ్డ పేరు మీద ఇలా పలికెను: **యెహోవా మరియొక కుమారుని నాకు దయచేయునుగాక** [יָסַף, *yasap*, "add to"]. చివరకు, ప్రసవవించుచుండగా మరణించిననూ రాహేలు మరొక కుమారునికి జన్మనిచ్చెను, బెన్యామీను (35:16–19).

## గొర్రెల కొరకు లాబానుతో యాకోబు యొక్క ఒప్పందం

## (35:25–43)

### యాకోబు జంతువులను కేటాయించడం (30:25–36)

**[25]రాహేలు యోసేపును కనిన తరువాత యాకోబు లాబానుతో-నన్ను పంపివేయుము; నా చోటికిని నా దేశమునకు వెళ్లెదను. [26]నా భార్యలను నా పిల్లలను నా కప్పగించుము; అప్పుడు నేను వెళ్లెదను; వారి కోసము నీకు కొలువుచేసితిని; నేను నీకు కొలువుచేసిన విధమును నీ వెరుగుదువుగదా అని చెప్పెను. [27]అందుకు లాబాను అతనితో-నీ కటాక్షము నా మీదనున్నయెడల నా మాట వినుము; నిన్నుబట్టి యెహోవా నన్ను ఆశీర్వదించెనని శకునము చూచి తెలిసికొంటినని చెప్పెను. [28]మరియు అతడు- నీ జీతమింతయని నాతో స్పష్టముగా చెప్పుము అది యిచ్చెద ననెను. [29]అందుకు యాకోబు అతని చూచి-నేను నీకెట్లు కొలువు చేసితినో నీ మందలు నాయొద్ద ఎట్లుండెనో అది నీకు తెలియును; [30]నేను రాకమునుపు**

**నీకుండినది కొంచెమే; అయితే అది బహుగా అభివృద్ధి పొందెను; నేను పాదముపెట్టిన చోటెల్ల యెహోవా నిన్ను ఆశీర్వదించెను; నేను నా యింటివారికొరకు ఎప్పుడ సంపాద్యము చేసికొందుననుకొనెను. [31]అప్పుడతడు-నేను నీ కేమి ఇయ్యవలెనని యడిగినందుకు యాకోబు-నీవు నాకేమియు ఇయ్యవద్దు; నీవు నాకొరకు ఈ విధముగా చేసినయెడల నేను తిరిగి నీ మందను మేపి కాచెదను. [32]నేడు నేను నీ మంద అంతటిలో నడచి చూచి పొడలైనను మచ్చలైనను గల ప్రతి గొఱ్ఱెను, గొఱ్ఱెపిల్లలలో నల్లని ప్రతిదానిని, మేకలలో మచ్చలైనను పొడలైనను గల వాటిని వేరుపరచెదను; అట్టివి నాకు జీతమగును. [33]ఇకమీదట నాకు రావలసిన జీతమును గూర్చి నీవు చూడవచ్చినప్పుడు నా న్యాయప్రవర్తనయే నాకు సాక్ష్యమగును; మేకలలో పొడలైనను మచ్చలైనను లేనివన్నియు, గొఱ్ఱెపిల్లలలో నలుపు లేనివన్నియు నా యొద్దనున్నయెడల నేను దొంగిలితినని చెప్పవచ్చుననెను. [34]అందుకు లాబాను-మంచిది, నీ మాటచొప్పుననే కానిమ్మనెను. [35]ఆ దినమున లాబాను చారయైనను మచ్చయైనను గల మేకపోతులను, పొడలైనను మచ్చలైనను గల పెంటిమేకలన్నిటిని కొంచెము తెలుపుగల ప్రతిదానిని గొఱ్ఱెపిల్లలలో నల్లవాటి నన్నిటిని వేరుచేసి తన కుమారుల చేతి కప్పగించి [36]తనకును యాకోబుకును మధ్య మూడుదినముల ప్రయాణమంత దూరము పెట్టెను; లాబానుయొక్క మిలిగిన మందను యాకోబు మేపు చుండెను.**

యాకోబు హారానుకు వచ్చిన ఉద్దేశమును నెరవేర్చెను మరియు ఇప్పుడు తన సొంత దేశమునకు తిరిగి వెళ్లుటకు కోరుకొనెను. ఆయన ఒక భార్యను చేసుకోవడం మాత్రమే కాదు, కానీ ఇద్దరిని, అదనంగా వారి దాసీలను చేసుకున్నాడు. ఈ స్త్రీల ద్వారా పదకొండు కుమారులు మరియు ఒక కుమార్తె గల పెద్ద కుటుంబమును కనెను. అయితే, కనానుకు వెళ్లాలనుకున్న అతని కోరిక, అతను తిరిగి వెళ్లడం కోరుకొని తన మామయైన లాబాను భంగపరచెను. యాకోబును మోసపుచ్చి తన సేవలను పొందుకునే ప్రయత్నంలో, లాబాను అతనితో ఒక ఒప్పందం చేసికొనెను. లాబాను వంచన ఉన్నపటికీ కూడా, దేవుడు యాకోబును చూసెను మరియు అతడు సంపన్నుడగుటకు కారణమయ్యెను.

**వచనము 25.** ఈ సన్నివేశం వృత్తాంతంలో ఒక మలుపును చూపిస్తుంది. పద్నాలుగు సంవత్సరాల సేవ తరువాత మరియు **రాహేలుకు యోసేపు** పుట్టిన తదుపరి, **యాకోబు లాబానుతో (**నన్ను**) పంపివేయుము**[10] తన సొంత దేశములో (אֶרֶץ, *'erets*, "land")నున్న బెయేర్షెబాకు (28:10) వెళ్లుదునని వేడుకొనెను. ఈ ప్రకటన తను పుట్టిన భూమిపై తనకున్న బెంగను సూచిస్తుంది, బహుశా లాబాను అర్థం చేసుకున్నది కూడా ఇదే కావచ్చు. అయితే, యాకోబు యొక్క వివరణయైన "నా దేశము" అనునది దేవుడు అబ్రాహాముతో (12:1; 13:15), ఇస్సాకుతో (26:3), మరియు తదుపరి బేతేలు దగ్గర యాకోబుతో (28:13) భూమిని గూర్చి చేసిన

వాగ్దానమును సూచిస్తుంది. యెహోవా తన కొరకు మరియు తన వారసులకు కొరకు నియమించిన దానిని వారసత్వంగా చెప్పుకొనుటకు తిరిగి వెళ్లవలెనని అనుకొనెను.

**వచనము 26.** యాకోబు లాబానును "(నన్ను) పంపించుమని," అడిగినప్పుడు, చాలా సంవత్సరాలు తన మామ యొద్ద **కొలువు** చేయుటకు కారణమైన **భార్యలను మరియు** (ఆయన) **కుమారులను** తనతో కూడా తీసుకువెళ్లుటకు అనుమతించమని కోరుకొనెను. ఈ వచనములో రెండుసార్లు, యాకోబు עָבַד (*'abad*) అను క్రియను ఉపయోగించెను, మరియు ఇది "పని చేశాడు" మరియు **అన్వయించడం**గా అనువదించబడింది; మరియు ఒకసారి సంబంధిత నామవాచకం עֲבוֹדָה (*ªbodah*), ఉపయోగించబడింది, **సేవచేయడం** అని దీని అర్థం. లాబానుకు మేనల్లుడుగా మరియు అల్లుడుగా, తన మామ తన పట్ల కఠినంగా ఉండి మోసం చేసి మరియు తన భార్యల కొరకు పద్నాలుగు సంవత్సరములు కొలువు చేయించెను (31:41). స్పష్టంగా, అతనిని అల్లుడుగా కంటే హక్కులు లేని ఒక బానిసగా చూసెను (31:43; నిర్గమ. 21:2–6).

**వచనములు 27, 28.** లాబాను ప్రత్యుత్తరం చర్చలకు తూర్పు మర్యాద సూత్రంగా ఉన్నది, కానీ అది కూడా మోసపూరితమైనది. యాకోబు విడచి వెళతానని చెప్పిన అభ్యర్థనను ఆయన మర్యాదపూర్వకముగా ఈ విధముగా చెప్పి తిరస్కరించెను, **నీ కటాక్షము నా మీదనున్నయెడల నా మాట వినుము**. తక్కువ స్థాయిలో నున్న వ్యక్తి ఎక్కువ స్థాయిలో నున్నవారితో మాట్లాడేటప్పుడు ఈ విధమైన విజ్ఞప్తి సాధారణం (18:3; 33:10; 47:29; 50:4). అయితే, ఈ సందర్భంలో ఇది కపటమైనది ఎందుకంటే యాకోబు తక్కువ స్థాయిలో ఉన్నాడని, తన పెద్ద కుటుంబమును పోషించుటకు తన వద్ద ఏమీ లేవని **లాబానుకు** తెలుసు. అందుచేత, అతను ఇలా చెప్పెను, **నిన్నుబట్టి యెహోవా నన్ను ఆశీర్వదించెనని శకునము చూచి తెలిసికొంటిని.** ఇది ఆశ్చర్యమైన ప్రకటన: యెహోవా నుండి ఒక ప్రకటనను పొందానని శకునమును వాడటం ద్వారా చెప్పెను, ఇది తరువాత ధర్మశాస్త్రంలో నిషేధించబడిన మంత్రం లాటిది (లేవీయకాండము 19:26; ద్వితియోపదేశకాండము 18:10).[11]

యాకోబు ద్వారా తన సంపద యొక్క నిజమైన మూలకారణం తానేనని చూపించుటకు యెహోవా లాబాను యొక్క అన్యమత పద్ధతిని సరిపరచియుండవచ్చు (1 సమూయేలు 28:7–19). అబ్రాహాము కుటుంబము మరియు అతని సేవకుల కుటుంబము యెహోవా యందు నమ్మికయుంచు వారని లాబాను కాలం క్రితం నేర్చుకొను యుండవచ్చు (24:1–61). యెహోవా తనకు బేతేలు యొద్ద ప్రత్యక్షమై (28:12–16), తనను దీవించి మరియు అనేకమందికి దీవెనకరముగా చేస్తానని యాకోబుతో చెప్పిన మాట ఆయన తన కుటుంబమునకు చెప్పియుండవచ్చు. లాబాను అప్పటికే నైపుణ్యం కలిగిన మోసగాడిగా నిరూపించుకొని, యాకోబును నిలిపివేసి మరియు తనకు సేవ చేయించుకొనే మరో

ప్రయత్నంలో యెహోవా వాగ్దానమును స్వలాభమునకు ఉపయోగించుకొనెను. ఆయన తన ప్రతిపాదనను దేవుని చిత్తమైనట్లుగా చూపించెను.

దీని ప్రకారం ఆయన ఇలా చెప్పెను, **నీ జీత మింతయని నాతో స్పష్టముగా చెప్పుము అది యిచ్చెద ననెను.** ఎప్పటిలాగే, లాబాను ఆదాయంపై దృష్టి కేంద్రీకరించెను. ఆయన పద్నాలుగు సంవత్సరాల ముందు ప్రతిపాదించిన మోసముతో కూడిన మొదటి ఒప్పందమును అతని ప్రకటన గుర్తుచేస్తుంది (29:15–20). ఈ సమయంలో, హారానులోనే ఉండేటట్లు లాబాను యాకోబుతో నూతన ఒప్పందం చేద్దామని అనుకున్నాడు.

**వచనములు 29, 30.** ఈ సారి తన మామ యొక్క ఒప్పందాన్ని అంగీకరించుటకు యాకోబు త్వరపడలేదు. కాని, ఆయన స్పష్టమైనదానిని తెలిపాడు:"**నేను నీకెట్లు కొలువు చేసితినో నీ మందలు నాయొద్ద ఎట్లుండెనో అది నీకు తెలియును; నేను రాకమునుపు నీకుండినది కొంచెమే; అయితే అది బహుగా అభివృద్ధి పొందెను; నేను పాదముపెట్టిన చోటెల్ల యెహోవా నిన్ను ఆశీర్వదించెను.** తన మామ అప్పటికే ఒప్పుకొన్న దానిని యాకోబు మాటలు పునరుద్ఘాటించినవి: అది తన అల్లుడు అక్కడ ఉండుటను బట్టి దేవుడు లాబానును బహుగా ఆశీర్వదించెను అనే విషయమే. యాకోబు ఆ తరువాత తన కుటుంబముతో విడచి తన సొంత సంపదను నిర్మించుకోవాలనే ఆశను వ్యక్తపరచాడు: **నేను నా యింటివారికొరకు ఎప్పుడు సంపాద్యము చేసికొందుననెను.**

**వచనములు 31–34.** దీనికి బదులుగా, **నేను నీకేమి ఇయ్యవలెను?** అని లాబాను అడిగాడు (30:31). వినడానికి, ఇది సహేతుకమైన ప్రశ్నగానే అగుపడుతుంది; కాని, తన మేనల్లుడికి వీడ్కోలు బహుమతులను ఇవ్వనని ఇప్పటికే ఆయన సూచించాడు. "(నీవు నావద్దనే పని చేస్తూ ఉండుటకు) నేను నీకు ఇంకా ఏమి చెల్లించాలి?" అని లాబాను అడుగుతున్నాడు (NJPSV; NJB; TEV చూడండి).

లాబాను తిరస్కరించలేనంత మర్యాదకరమైన విన్నపాన్ని **యాకోబు** అడుగుతున్నాడు. నిజానికి, ఆయన **దేనిగురించి** కూడా ఇంతకు ముందు అడిగినట్లుగా లేదు. ఆయన మంద అంతటిలో నడచి **పొడలైనను మచ్చలైనను గల ప్రతి గొఱ్ఱెను, గొఱ్ఱెపిల్లలలో ప్రతి నల్లదానిని, మేకలలో మచ్చలైనను పొడలైనను గలవాటిని** (30:32) వేరుపరచుటకు లాబాను ఆయనను అనుమతించినట్లయితే, తన మామ యొక్క మందను **మేపి కాచెదను** అని యాకోబు వాగ్దానము చేశాడు. ఇదియుగాక **పొడలైనను మరియు మచ్చలైననుగల మేకపిల్లలను కూడా వేరుచేసి** అట్లు చేసినవాటిలో నుండి ఆయనకు **జీతమగును** అని కూడా ఆయన అన్నాడు.[12] తరువాతి కాలంలో, అనగా తనకు రావలసిన **జీతములను** గూర్చి లాబాను చూడవచ్చినప్పుడు (30:33) తన **న్యాయప్రవర్తన**ను పరీక్షించుటకు తన మామకు చాలా సులువు అవుతుందని కూడా యాకోబు అన్నాడు.

యాకోబు యొక్క షరతులు లాబానును బాగా ఆకట్టుకున్నాయి. ఇక్కడ మన పితరుడు కోరుకున్నదానితో పోల్చితే, ప్రాచీన పశ్చిమ ఆసియాలో సాధారణంగా గొఱ్ఱెపిల్లలు మరియు మేకలు వ్యతిరేక రంగులో ఉండేవి: గొఱ్ఱెలు ఎక్కువుగా తెలుపు రంగులోను మరియు మేకలైతే నల్లవి లేదా ముదురు ఇటుకరాయి పొడుం రంగులో ఉండేవి. దీనికి తోడు, పితరునిచే స్పష్టపరచబడుతున్న జంతువుల రంగు చాలా అరుదు, బహుశా ఆ మంద అంతటిలో 15 నుండి 20 శాతమునకు మించకుండా అవి ఉంటాయి. యాకోబు యొక్క భాగముపై తెలుపబడిన శాతం కంటే కూడా ఇంకా తక్కువగా ఉంటాయని లాబాను ఆశించాడు. ఎందుకంటే, ప్రతి సంవత్సరము జంతువుల నష్టముపై ఒక లెక్క వేయవలసి ఉంటుంది, మరియు అందులో ఉన్న తేడాను కాపరి తన సొంత మందలో నుండి ఇవ్వవలసి ఉంటుంది.[13]

తన జంతువులను కాయునట్లయితే తన అల్లుడి దగ్గర నుండి ఇంకొంత లబ్ది పొందవచ్చని మామగారు గొప్ప నమ్మకంతో ఉన్నారు. అయినప్పటికీ, యాకోబు అట్టి ఉదారత కలిగిన అవకాశముతో ఆగలేదు. ఒకవేళ లాబాను తన అల్లుడి మందలలో శుద్ధమైన తెలుపు రంగులో ఉండే గొఱ్ఱెలనైనను లేదా నల్లనివిగా ఉండే మేకలనైనను కనుగొనిన యెడల, వాటిని **దొంగిలింపబడినవి అని చెప్పవచ్చును** అని అన్నాడు. దీనికి అర్థం ఒకవేళ తన మందలో ముదురు-రంగులో ఉన్న జంతువులు ఉన్నట్లయితే తన మామకు ధారాళంగా జరిమానా చెల్లిస్తానని యాకోబు వాగ్దానము చేస్తున్నట్లుగా ఉన్నాడు.[14]

ఈ ఒప్పందంలోని ప్రతి ఒక్క ఏర్పాటు **లాబాను**కు అనుకూలంగా ఉన్నట్లు అనిపించింది, మరియు ఆయన యాకోబును మరలా విజయవంతంగా మోసగించానని ఆయన అనుకొని ఉంటాడు. అందుకనే, **మంచిది, నీ మాట చొప్పుననే కానిమ్ము** అని ఆయన అన్నాడు (30:34).

**వచనములో 35, 36.** ఈ యిద్దరి మనుష్యుల మధ్య ఈ ఒప్పందం అలా జరిగిందో లేదో వెంటనే లాబాను దానిని విస్మరించాడు. అసాధారణ రంగు కలిగిన జంతువులు అన్నియు యాకోబుకు తన మందను నిర్మించుకొనులాగున ఇవ్వవలసియుంది. అయినప్పటికీ మోసగాడైన తన మామ **చారయైనను మచ్చ యైనను గల మేకపోతులను, పొడలైనను మచ్చలైనను గల పెంటిమేకలన్నిటిని కొంచెము తెలుపుగల ప్రతిదానిని గొఱ్ఱెపిల్లలలో నల్లవాటిని** మేపవలసినవాడిగా ఉన్నాడని అనుకున్నాడు. కాబట్టి, **ఆ దినమున** ఆయన యాకోబునకు చెందవలసిన మందలనన్నిటిని **వేరుచేసి** వాటిని **తన కుమారులకు అప్పగించెను.** అప్పుడు లాబాను **తనకును యాకోబునకును మధ్య మూడు దినముల ప్రయాణమంత దూరము పెట్టెను**, మరియు **లాబాను యొక్క మిగిలిన మందను యాకోబు మేపునట్లు** ఉంచెను. ఇది ఒక “విశాలమైన మధ్యస్థ మండలము”ను సృష్టించి, యాకోబు మేపుతున్న ప్రదేశంలోనికి దేశదిమ్మరులు రాకుండా చేసింది.[15]

## యాకోబు యొక్క కపటమైన పథకము (30:37–43)

**[37]యాకోబు చినారు జంగిసాలు అను చెట్ల చువ్వలను తీసికొని ఆ చువ్వలలో తెల్లచారలు కనబడునట్లు అక్కడక్కడ వాటి తొక్కలు ఒలిచి [38]మందలు నీళ్లు త్రాగ వచ్చినప్పుడు అవి చూలు కట్టుటకు అతడు తాను ఒలిచిన చువ్వలను మందలు త్రాగుటకు వచ్చు కాలువలలోను నీళ్లగాళ్లలోను వాటియెదుట పెట్టగా [39]మందలు ఆ చువ్వల యెదుట చూలు కట్టి చారలైనను పొడలైనను మచ్చలైనను గల పిల్లలను ఈనెను. [40]యాకోబు ఆ గొఱ్ఱెపిల్లలను వేరుచేసి, చారలుగల వాటి తట్టును లాబాను మందలలో నల్లని వాటి తట్టును మందల ముఖములు త్రిప్పి తన మందలను లాబాను మందలతో నుంచక వాటిని వేరుగా ఉంచెను. [41]మందలో బలమైనవి చూలు కట్టినప్పుడెల్లను అవి ఆ చువ్వల యెదుట చూలు కట్టునట్లు యాకోబు మంద కన్నుల యెదుట కాలువలలో ఆ చువ్వలను పెట్టెను. [42]మంద బలహీనమైనప్పుడు పెట్టలేదు. అట్లు బలహీనమైనవి లాబానుకును బలమైనవి యాకోబునకును వచ్చెను. [43]ఆ ప్రకారము ఆ మనుష్యుడు అత్యధికముగా అభివృద్ధిపొంది విస్తారమైన మందలు దాసీలు దాసులు ఒంటెలు గాడిదలు గలవాడాయెను.**

**వచనములు 37–39.** లాబాను తన అల్లుడిని మరలా ఓడించానని అనుకుంటూ తన బ్రహ్మాండమైన మోసములను గూర్చి తన్నుతానే అభినందించుకుంటూ అక్కడ నుండి వెళ్లి ఉంటాడు. కాని, ఈ సారి **యాకోబు**కు తన సొంత ప్రణాళిక ఉంది. ఆయన **చినారు జంగిసాలు చెట్లు, బాదం** మరియు **మామూలు** చెట్ల చువ్వాలను తొలచి **తెల్లచారలు** కనబడునట్లు వాటి తొక్కలు వలిచి వాటిని **కాలువలలోను**, అనగా, **నీళ్లగాళ్లలో** ఉంచాడు.

**మందలు నీళ్లు త్రాగుటకు వచ్చినప్పుడు అవి ఆ చువ్వలు ఉన్న చోటన చూలు కట్టెను.** బెరడు క్రింద తెలుపు రంగు ఉన్న చెట్లను యాకోబు వాడుటకు ప్రయత్నించడం అనునది "ఈ తెల్లని కొమ్మల ద్వారా లాబాను (ఆయన పేరు యొక్క అర్థం 'తెల్లని' అని) నుండి ఎక్కువ రాబట్టాలనుకోవడం" అని కొందరు వ్యాఖ్యానకర్తలు అంటారు.[16] ఇంకొక సూచన ఏమనగా, ప్రాచీన కాలములలో ఈ చెట్లకు ఔషధ గుణములు కలిగిన ఒక రకమైన మత్తు పదార్థం ఉండేది అనియు మరియు వాటి యొక్క ఆవిరి "జంతువులలో ఒక ప్రక్రియను ఆరంభించుట వలన అవి చూలు కట్టుటకు సిద్ధపడేవి" అనియు చెప్తుంటారు.[17] మరొక సాధ్యపడే విషయం ఏమంటే, "ఈ చువ్వల" దగ్గర "మందలు" చూలు కట్టున్నట్లు చేయుట ద్వారా యాకోబు ఒక విధమైన వంశవృద్ధి ప్రక్రియను ప్రయోగిస్తున్నాడని, దీని ప్రకారముగా ఆరోగ్యకరమైన జంతువులలోని అణిగిన కణములు బయటకు వచ్చేవి అని, మరియు దీనిలో ఆయనకున్న ప్రతిభ వలన బలమైన ఆడ జంతువులు **చారలైనను పొడలైనను మచ్చలైనను గల పిల్లలను** కనునట్లు చేసినవని దీని సారాంశం.[18]

యాకోబు యొక్క తంత్రములు రాహేలు పుత్రదాతవృక్షపు పండ్ల విషయంలో చేసినట్లుగా కొంత శకునంతోను మరియు మాయతోను నిండియున్నట్లుగా ఉన్నవి. ఈ రెండు సందార్భాలు మనకు తెలుపుతున్నది ఏమంటే వారి క్రియలు ఏమైనప్పటికీ కూడా దేవుడే చొరవ తీసుకొని వారిని ఆశీర్వదించాడు (30:23, 24; 31:5–13).

**వచనము 40.** ఈ వచనములో కొంత కలవరము కలుగుతుంది, **యాకోబు ఆ గొఱ్ఱెపిల్లలను వేరుచేసి, చారలుగల వాటి తట్టును లాబాను మందలలో నల్లని వాటి తట్టును మందల ముఖములు త్రిప్పి తన మందలను లాబాను మందలతో నుంచక వాటిని వేరుగా ఉంచెను** అని ఈ వచనము చెప్తుంది. ఇక్కడ చెప్పబడిన ప్రక్రియ 30:35, 36 వచనములలో చెప్పబడిన ప్రక్రియతో విరుద్ధంగా ఉంది, అక్కడ లాబాను మచ్చయైనను గల మేకపోతులను గొఱ్ఱెపిల్లలలో నల్లవాటిని వంశవృద్ధి నిమిత్తం వాడకుండా ఉండునట్లు యాకోబు తన కుమారులకు ఇచ్చెనని చదువుతాము. అయినప్పటికీ, ఈ కష్టమును పరిష్కరించుటకు రెండు విధానములు ఉన్నాయి. ఈ వచనము యొక్క మొదటి భాగము "గొఱ్ఱెపిల్లల" (הַכְּשָׂבִים, *hakkᵉśabim*, "గొఱ్ఱెపిల్లలు") యొక్క వంశవృద్ధి గురించి మాట్లాడుతుంది, కాని యాకోబు ఈ ప్రక్రియను 30:37–39లో వివరించినట్లుగా "మందలు" (הַצֹּאן, *hatstso'n*, "మేకలు") అనే ప్రస్తావనతో మార్చి ఉంటాడు.

దీనికి తోడు, 30:40 రెండు మందల మేకలను గూర్చి ప్రస్తావిస్తుంది: "మచ్చలు" గలిగిన మరియు "నల్లనివైన" మేకలు; కాబట్టి, యాకోబు తెల్లనివైన గొఱ్ఱెపిల్లలను వేరుచేసి (తన సొంత మందలోని) చారలుగల మేకలు మరియు (లాబాను మందనుండి) నల్లని మేకల తట్టు ముఖము త్రిప్పి ఉంచి ఉంటాడు. చారలు గలిగిన మరియు నల్లనివైన ఈ మేకల చేరిక అనునది మేకల కొరకు ఆయన ప్రయోగించిన వివిధ రంగులు కలిగిన తొలిచిన "చువ్వల"ను (కొమ్మలు) పోలినవిగా ఉన్నాయి. ఈ వ్యూహం ప్రయోగించుట ద్వారా, యాకోబు తన సొంతవిగా చెప్పుకొనునట్లు నల్లని గొఱ్ఱెపిల్లలను పొంది ఉంటాడు, ఇది స్పష్టంగా దేవుని ఆశీర్వాదం లేకుండా జరిగేది అయితే కాదు. యాకోబు లాబాను మందను మేపిన ఆరు సంవత్సరాల కాలంలో (31:41 చూడండి) ప్రయోగించిన అనేక ప్రయోగముల క్రమములో ఈ వాక్యభాగంలోని సంక్లిష్టతలు ఉత్పన్నమౌతున్నాయి.

**వచనములు 41, 42.** ఇక్కడ ఉన్న అసలు ఆలోచన ఏమంటే యాకోబు తన కొరకు ఆ చారలు గల **చువ్వల** (కొమ్మల) వద్ద చూలు కట్టునట్లు బలమైన ఆడు జంతువులను ఎన్నుకొని **బలమైన** జంతువులను పొందుకున్నాడు, కాని **బలహీనమైన** జంతువులను లాబానుకు వదిలివేసెను. బలహీనమైనవి తన మామ కొరకు పిల్లలను పెడుతుండగా, ఆయన యొక్క జంతువులు క్రమేపీ కొద్దిగా మరియు బలహీనంగా అయ్యాయి, కాని యాకోబుకు చెందినవి మాత్రం ఇంకను అధిక సంఖ్యగా మరియు బలంగా మారాయి.

**వచనము 43.** పితరుడు **అత్యధికముగా అభివృద్ధి పొందెను** అను మాటతో కథనము యొక్క ఈ భాగము ముగుస్తుంది. "అభివృద్ధి పొందెను" (פָּרַץ, *parats*) అనే మాట 28:14 నుండి పునరావృతం చేయబడింది, అక్కడ యాకోబు యొక్క సంతానము వారు "వ్యాపించెదరు" అని దేవుడు వాగ్దానము చేశాడు. ఈ పదము 30:30లో కూడా వస్తుంది, అక్కడ లాబాను యొక్క సంపద ఎలా "విస్తరించినదో" యాకోబు చెప్తున్నాడు. ఇక్కడ అయితే, లాబానుపై యాకోబు ఆధారపడునట్లు ఆయన ఎంతగా ప్రయత్నించిననూ, దేవుడు యాకోబుకు ఇచ్చిన గొప్ప అభివృద్ధిని గూర్చి ఈ పదము మాట్లాడుతుంది. పితరుడు **విస్తారమైన మందలు, దాసీలు దాసులు,** అలాగే **ఒంటెలు మరియు గాడిదలను** పొందినవాడాయెను.

## అన్వయము

### ఫలింపజేయగల దేవుని యొక్క శక్తి (29:31–30:43)

పితరులు మరియు తరువాతి యూదా ప్రజలు పెద్దరికాన్ని (తల్లిదండ్రులను) దేవుని నుండి వచ్చిన ఒక స్వాస్థ్యముగా భావించేవారు (కీర్తన. 127:1, 3). కుటుంబ నిర్వాహకత్వముపై గల ఈ ఆలోచన ప్రత్యేకంగా యాకోబు విషయంలో తగినది, ఆయనకు దేవుడు అబ్రాహాము మరియు ఇస్సాకుకు చేసిన మూల వాగ్దానమును మరలా పునరావృతం చేశాడు. యెహోవా భూమిని గూర్చిన తన వాగ్దానమును పునరుద్ఘాటించాడు, మరియు "నీ సంతానము భూమిమీద లెక్కకు ఇసుక రేణువులవలెనగును; నీవు పడమటి తట్టును తూర్పుతట్టును ఉత్తరపు తట్టును దక్షిణపు తట్టును వ్యాపించెదవు, భూమియొక్క వంశములన్నియు నీ మూలముగాను నీ సంతానము మూలముగాను ఆశీర్వదింపబడును" అని ఆయన అన్నాడు (28:14).

ఈ కథనములోని మొదటి భాగము చాలా తక్కువ ఇతివృత్తాన్ని కలిగి ఉంది, కాని బేధాలు మరియు పోరాటాల ఆధారంగా కొన్ని అంశాలను, ప్రత్యేకంగా యాకోబు యొక్క ఇద్దరు భార్యలైన రాహేలు మరియు లేయాల విషయంలో, ఇది వృద్ధి చేస్తుంది. దేవుడు యాకోబును ఇశ్రాయేలు యొక్క పండ్రెండ్రు గోత్రముల వారికి మూల పురుషునిగా ఉండుటకు పిలిచాడు, కాని ఆయనకు ప్రధాన భార్యలైన యిద్దరి మధ్య నెలకొన్న పోరాటం తన ఇద్దరు మాధ్యమిక భార్యలైన బిల్హా మరియు జిల్పాల మధ్య పోరాటంలో యాకోబు తలదూర్చుకొనేటట్లు దారితీసింది. యాకోబునకు పెద్ద కుటుంబమును నిర్మించుటకు సహాయపడిన ఈ నాలుగురు స్త్రీలు ఈ పితరునికి అనేక సమస్యలను కూడా తెచ్చారు. మనము ఇంతకు ముందు చూచినట్లుగానే, ఆయన విడిపోయిన మరియు పోటీతత్వం ఉన్న కుటుంబములోనే పెరిగాడు (25:28). ఇప్పుడు అయితే, కలవరపరచే విధానంలో తరచుగా ఈర్ష్య

మరియు విభజనలు చోటుచేసుకొనే కుటుంబమును ఒకదానిని సృష్టించుటలో ఆయన పాల్గొన్నాడు.

*ఒక జాతిని నిర్మించాలనే ఆయన ప్రణాళికను నెరవేర్చుటకు దేవుడు తన కరుణ మరియు దయలో బాధింపబడినవారిని మరియు ప్రేమింపబడలేనివారిని ఆశీర్వదించాడు* (29:31–35). 29:30లో యాకోబు “లేయాకంటే రాహేలును బహుగా ప్రేమించె”ను అని కథకుడు చెప్తున్నాడు. “లేయా ద్వేషింపబడుట యెహోవా చూచి” ఆమె గర్భము ధరించులాగున శక్తిని ఇచ్చాడు; మరియు ఆమె ఒక కుమారుని కనెను (29:31). ఈ జననమును బట్టి లేయా చాలా సంతోషించి ఆ బిడ్డకు “రూబేను” అని పేరు పెట్టింది, దీనికి “చూడు, ఒక కుమారుడు” అని అక్షరార్థము. ప్రాచీన కాలములలో తండ్రులు కుమార్తెల కంటే కుమారులనే ఎక్కువగా ఇష్టపడేవారు గనుక (కీర్తన 127:4, 5[19]), ఈ బిడ్డను బట్టి ఆమె దేవుని స్తుతించింది. ఇంకా, దేవుడు తన “శ్రమ”ను “చూచియున్నాడు” గనుక ఇప్పుడు ఆమె భర్త రాహేలును ప్రేమిస్తున్నట్లుగానే తనను కూడా “ప్రేమిస్తాడు” (29:32) అని ఆమె చెప్పింది. ఆమె తప్పుగా ఆలోచించింది; ఆమె ఆలోచించినట్లుగా ఆమెకు జరగలేదు. “ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు” అని యేసు చెప్పాడు (మత్తయి 6:24). ఇద్దరినీ సమానంగా ప్రేమించి కుటుంబములో ఐక్యతను ఉంచడం చాలా కష్టం. ఇదే బహుళ పత్నీ ప్రయోగమునకు విరోధమైన ఒక వాదాన్ని మనకు ఇస్తున్నట్లుగా ఉంది.

అయినప్పటికీ, తాను పొందుతున్న గర్భఫలం అనునది దేవుని చొరవ వలన కలిగినది అని యాకోబు గ్రహిస్తే తప్పక తనను ఎక్కువగా ప్రేమిస్తాడు అనే నిరీక్షణలో లేయా తన జీవితాన్ని కొనసాగించింది. తెలియబడని కొంత కాలము గడచిన తరువాత, ఆమె మరలా గర్భము ధరించి రెండవ కుమారునికి జన్మనిచ్చింది. తాను “ద్వేషింపబడినది” అన్న విషయాన్ని యెహోవా “విన్నాడు” అనే విషయానికి ఈ జన్మను ఆరోపించింది; కాబట్టి, ఆ బాలునికి “షిమ్యోను” అని పేరు పెట్టింది (29:33)–ఈ పేరు “విన్నాడు” అనే పదముపై చాతుర్యముగా ఉంది, తన దుఃఖ పరిస్థితిని బట్టి ఆమె దేవునికి ప్రార్థిస్తూ ఉన్నదని ఈ మాట సూచిస్తుంది.

అంత సులువుగా విడిచిపెట్టే తత్వం లేయాది కాదు. ఒక విషయంలో ఆమె రాహేలును అధిగమించింది, అదే బిడ్డలను కనే విషయంలో. యాకోబు కుమారులను ఇంకా కోరుకుంటున్నాడు గనుక, ఆ విషయంలో ఆమె ఆయనను ప్రోత్సహించింది; కాబట్టి ఆమె గర్భము ధరించి మూడవ కుమారునికి జన్మనిచ్చింది. ఈ సారి తన భర్త తనను “హత్తుకొని” లేదా తనతో “కలిసిపోయి” ఉంటాడు అని అనుకుంది; కాబట్టి, ఆయనకు “లేవీ” అని పేరు పెట్టింది, ఈ పేరు హెబ్రీ మూల పదములో “కలిసి ఉండుట” అనే అర్థాన్ని కలిగి ఉంది (29:34). ఆమె భౌతికంగా యాకోబుతో కలిసి ఉంది, మరియు వారిద్దరూ కలిసి ముగ్గురు కుమారులను ఉత్పత్తి చేశారు; కాని తన భర్తకును మరియు ఆయన ప్రేమించే తన ప్రియ భార్యయైన

రాహేలునకు మధ్యనున్న సంబంధమువలె లోతైన హృదయముల కలయిక కొరకు ఆమె ఎంతగానో ఆశతో ఎదురు చూచింది.

లేయా మరలా నిరుత్సాహపడిపోయింది, కాని తన ప్రయత్నమును మాత్రం వీడలేదు. నాల్గవ సారి ఆమె గర్భము ధరించి యాకోబు కొరకు ఒక కుమారుని కన్నది. ఆమె యెహోవాకు యెడతెగక ప్రార్థన చేస్తున్నట్లుగా స్పష్టమౌతుంది. ఎందుకంటే విజయవంతమైన ఈ కాన్పు తరువాత ఆమె "ఈసారి యెహోవాను స్తుతించెదను" అని అంటుంది. తన కుమారునికి "యూదా" అనే పేరును ఇచ్చింది, ఈ పేరు హెబ్రీ మూల పదంలో "స్తుతి" అనే అర్థాన్నిచ్చే పదం నుండి వచ్చింది (29:35). తన నాల్గవ కుమారుని జననంతో, తన భర్త తనపట్ల చూపుతున్న చిన్నచూపును బట్టి యెహోవాకు ఫిర్యాదు చేయడం మానేయాలని లేయా అనుకుంది. దీనికి బదులు, ఆరోగ్యవంతుడైన ఈ నాలుగవ కుమారుని ఇచ్చి ఆశీర్వదించినందుకు దేవుని స్తుతించాలని ఆమె నిశ్చయించుకొంది.

యాకోబు లేయాను ప్రేమించినదానికంటే రాహేలునే ఎక్కువగా ప్రేమించినప్పటికీ, తరువాతి యూదియా చరిత్రలో లేయా తన భర్త పట్ల కలిగియున్న అనింద్యమైన ప్రేమా మాదిరిని దేవుడు గౌరవించాడు. ఇది సుస్పష్టంగా ఉంది, ఏలయనగా అత్యంత ప్రాముఖ్యమైన గోత్రములలో రెండు గోత్రములు లేయా ద్వారా, అనగా లేవీ మరియు యూదా ద్వారా వచ్చినవి. మొదటిది యాజక గోత్రమైన లేవీ గోత్రము, ఈ గోత్రము ధర్మశాస్త్రమును ఇచ్చినటువంటి మోషేను మరియు ఇశ్రాయేలులో లేవీయుల యాజకత్వానికి పితరునిగా ఉన్న మోషే సహోదరుడైన అహరోనులను పుట్టించింది. రెండవది రాజ గోత్రమైన యూదా గోత్రము, దీనినుండే ఇశ్రాయేలు యొక్క గొప్ప రాజైన దావీదు, తద్వారా ఆఖరుకి "రాజుల రాజైన" (ప్రకటన 19:16) మరియు లోకమునకు రక్షకుడైన యేసు క్రీస్తు కూడా వచ్చారు.

*తన కృపనుబట్టి దేవుడు తన ప్రజలలో లోపభూయిష్టమైన మానవ ప్రయత్నములు, ద్వేషములు మరియు మూఢనమ్మకముల ప్రయోగములు ఉన్నప్పటికీ వారిని ఆశీర్వదించాడు.* రాహేలు యాకోబుకు ప్రియమైన భార్య అయినప్పటికీ, ఆమె గొడ్రాలుగా ఉండి బిడ్డలకు జన్మనివ్వలేని స్థితిలో ఉండుటను బట్టి తన సహోదరిపై పూర్తి ద్వేషముతో ఉండులాగు చేసింది. పరిశుద్ధ గ్రంథ ప్రపంచంలో, బిడ్డలు లేమిని తీవ్రమైన వేదనగా ప్రజలు భావించేవారు. అయినప్పటికీ, లేయావలె కాక, రాహేలు తన యొక్క గొడ్రాలు స్థితిని బట్టి దేవునికి ప్రార్థించినట్లుగా ఏ సూచన కూడా లేదు. అతిశయోక్తియైన తన నిరాశా ఆర్తధ్వనితో తన యొక్క వేదన అంతటిని తన భర్తపై చూపింది. అదేదో ఆయన పొరపాటు అయినట్లు, "నాకు గర్భఫలమునిమ్ము; లేనియెడల నేను చచ్చెదను" అని ఆయనను ఆజ్ఞాపిస్తుంది (30:1).

మన సొంత పొరపాట్లను గూర్చి మరియు వైఫల్యాలను గూర్చి ఇతరులను నిందించే మానవుని తత్వం ఏదేను తోటలో ఆదాము మరియు హవ్వాలతో

ప్రారంభమై (3:1–13), ఈ నాటికి కూడా కొనసాగుతుంది. నిజానికి, ఇది మానవాళి యొక్క అతి పెద్ద సమస్యగా ఉంది. పాపమును లేదా వైఫల్యమును ఒప్పుకోవడం అనేది మన అహమును మరియు స్వయం-మూల్యాన్ని దెబ్బతీస్తుంది, మరియు ఏదైనా ఒక విషయంలో మనం భౌతికంగా బలహీనంగా ఉన్నామనే ఏ ఒక్క సూచన విషయంలో కూడా ఇదే నిజం. హేతుబద్ధకంగా, యాకోబు రాహేలు యొక్క సహోదరి ద్వారా నాలుగురు కుమారులకు తండ్రి అయ్యాడు గనుక పిల్లలను కనలేని తనలోని అసమర్థతను బట్టి రాహేలు యాకోబును నిందించడం అనేది మూర్ఖత్వం అవుతుంది. నిశ్చయంగా, ఆమె యొక్క గొడ్రాలుతనం ఆమెపై యాకోబుకు ఆసక్తి లేక వచ్చినది కాదు. ఎందుకంటే, తన హృదయంలో ఆమెకు తన నిజమైన ప్రేయసిగా ప్రత్యేక స్థానం ఉంది మరియు ఈ స్థానం లేయాకు లేదు. బిడ్డను గూర్చిన కోరికను యాకోబుపై ఉంచినందున ఆయన కోపము రాహేలుపై రగులుకొని, “నేను నీకు గర్భఫలమును ఇయ్యకపోయిన దేవునికి ప్రతిగా నున్నానా?” అని ఆయన వెంటనే అన్నాడు (30:2).

తన నిరాశలో శారా అబ్రాహామునకు ప్రయోగించిన అదే ప్రయోగము వైపుకు (16:1–4) రాహేలు కూడా తిరిగింది: తన దాసియైన బిల్హాను యాకోబుకు ఇచ్చి, వారిద్దరి కలయిక ద్వారా జన్మించిన బిడ్డ చట్టపరంగా తనకు కుమారుడు అవుతాడని భావించింది (30:3). ఈ విధమైన అద్దె (సర్రోగేట్) మాతృత్వం ద్వారా, ప్రాచీన కాలాలలో దేవుడు కొన్ని ఆచారాలను అనుసరించడానికి అనుమతించాడు అని చూడగలం, అయితే ఈ ఆచారములు మోషే యొక్క ధర్మశాస్త్రంలోను మరియు క్రొత్తనిబంధనలోను తిరస్కరించబడ్డాయి.

బిల్హాకు ఇద్దరు కుమారులు పుట్టినప్పుడు వారికి రాహేలు ఎన్నుకున్న పేరులు లేయా తన కుమారులకు ఇచ్చిన పేరుల వలె లేవు. లేయా అయితే దృఢమైన విశ్వాసమును మరియు స్తుతితో నిండిన హృదయమును ప్రతిబింబించేటట్లుగా పేరులను ఎన్నుకుంటే, రాహేలు ఎన్నుకున్న పేర్లు మాత్రం తన సహోదరి పట్ల ఆమెకున్న చేదైన మరియు ద్వేషపూరితమైన పోరాటమును బయలుపరచేవిగా ఉన్నాయి. బిల్హా యొక్క మొదటి కుమారునికి దాను (“తీర్పు తీర్చబడ్డ”) అనే పేరునిచ్చి, “దేవుడు నాకు తీర్పు తీర్చెను” (30:6) అని అంటుంది. రెండవ వానికి “నఫ్తాలి” అని నామకరణం చేసింది, “గొప్ప పోటీలలో” లేదా పోరాటములలో తన సహోదరిపై గెలిచినది అని ఈ పేరు సూచిస్తుంది (30:4–8). సాధారణ కుటుంబములలో మనం మామూలుగా చూచే పిల్లల మధ్య ఉండే గొడవల కంటే ఎక్కువ గొడవలు ఇవి. ఈ ఇద్దరి సహోదరిల మధ్య నెలకొన్న నాశనాత్మక ద్వేషము మరియు పగ కయీను ద్వేషములోని తీవ్రతను మరియు తన సహోదరుడైన హేబెలును చంపినంత పగకు (4:3–8) ఎన్నడు చేరలేదు, కాని ఇదేవిధమైన తన కుమారుల ఆలోచన యోసేపు కథలో విషాదకరమైన ముగింపునకు దారితీసినంతగా అయింది (37:2–20).

సమయము గడిచిన కొలదీ, తాను ఇకనెన్నడు గర్భము ధరించలేను అని లేయా గ్రహించింది; కాబట్టి రాహేలు యాకోబుకు బిల్హాను బహుమతిగా ఇవ్వడానికి స్పందిస్తూ తన సొంత దాసియైన జిల్పాను కూడా లేయా యాకోబుకు ఇచ్చింది. ఈ విధంగా, ఈ యిద్దరి సహోదరిల మధ్య పోటీ కొనసాగింది; చిన్నదానికి తాను గెలిచాననే తృప్తిని మిగల్చకూడదని పెద్దది అనుకుంది. జిల్పా యొక్క మొదటి బిడ్డకు లేయా "గాదు" అని నామకరణం చేసింది, ఈ జన్మ ద్వారా ఆమె "అదృష్టము"ను అనుభవించానని వ్యక్తపరచింది (30:9–11). తన దాసి ద్వారా రెండవ కుమారుడు కలిగిన తరువాత స్త్రీలు అందరూ ఆమెను "భాగ్యవతి" అని అంటారు అనుకొని లేయా ఆ బిడ్డకు "ఆషేరు" అని పేరుపెట్టింది, దీనికి అర్థం "ధన్యులు" (30:12, 13).

ఈ యిద్దరి సహోదరిల మధ్య నెలకొన్న పోటీతత్వ వైషమ్యము గోధుమల పంట కాలంలో, రూబేను పొలములో కొన్ని పుత్రదాతవృక్షపు పండ్లను కనుగొని తన తల్లియైన లేయాకు ఇచ్చిన కాలంలో, మరలా ఎగిసింది. పశ్చిమ ఆసియాలోని ప్రజలు ఈ మొక్కలకు వీర్యావర్తకమైన గుణములు మరియు ఫలదీకరణకు సహాయపడే గుణాలు ఉన్నాయని నమ్మేవారు, కాబట్టి రాహేలు ఈ పండ్లలో కొన్నిటిని తన సహోదరి నుండి అడిగినది. లేయా ఆమెను తీక్షణంగా గద్దిస్తూ, తన భర్తను మరియు అలాగే తన కుమారుని యొక్క పుత్రదాతవృక్షపు పండ్లను దొంగిలించావని ఆమెను నిందించింది. రాహేలుకు యాకోబుపై ఎంతటి పట్టు ఉన్నదంటే, యాకోబు లేయాతో శయనించాలంటే రాహేలు యొక్క అనుమతి అవసరం అన్నట్లుగా ఉంది. గర్భవతి అగుటకు తనకున్న నిరాశను బట్టి, ఆ రాత్రి లేయా యాకోబుతో శయనించవచ్చని రాహేలు ఒప్పుకుంది; కాని దీనికి వెల రూబేను తీసుకొచ్చిన పుత్రదాతవృక్షపు పండ్లలోని కొన్ని పండ్లు ఆమె కోరింది (30:14, 15).

ఈ విధంగా లేయా గర్భము ధరించి ఐదవ కుమారునికి జన్మనిచ్చులాగున తన భర్తను ఒక రాత్రి కొరకు "అద్దె"కు తీసుకొంది. ఈ బిడ్డకు ఆమె ఎన్నుకున్న పేరు "ఇశ్శాఖారు" అని, ఈ పేరు లైంగిక సంబంధముల కొరకు ఆమె తన భర్తను "అద్దె"కు తీసుకొంది అనే సత్యముపై పదచాతుర్యముగా ఉంది (30:16–18). కొంత కాలము గడచిన తరువాత లేయా తన ఆరవ మరియు ఆఖరు కుమారునికి జన్మనిచ్చింది, ఈయనను ఆమె "జెబూలూను" అని పిలిచింది ఎందుకంటే ఆయనను ఆమె దేవుని నుండి వచ్చిన "వరము"గా భావించింది. చాలా సంవత్సరములు గడచిన తరువాత తన భర్తకు ఆమె ఆరుగురు కుమారులను ఇచ్చినందున ఆమెను ప్రేమిస్తాడు అని ఆశించింది (30:19, 20). ఆఖరుగా, లేయా తన ఆఖరు బిడ్డకు, కుమార్తెకు, జన్మనిచ్చింది. ఈ పాపకు ఆమె "దీనా" అని పేరు పెట్టింది ఎందుకంటే దేవుడు తనకు "తీర్పు తీర్చాడు" అని ఆమె భావించింది (30:21). గర్భవతి అగుటకు యాకోబుతో కొన్ని రాత్రులు గడుపు లాగున లేయా రాహేలుతో ఆడిన అధిక బేరసారములను

గూర్చి వాక్యము ఏమి చెప్పుట లేదు. కాని, ఈ యిద్దరి సహోదరిల మధ్యనున్న పోరాటం కొనసాగుతుందని కథనము స్పష్టపరుస్తుంది, కాబట్టి బహుళ పత్నీవ్రతము యొక్క విషాదమును గూర్చి వాక్యము సాక్ష్యమును ఇస్తుంది.

ఆఖరుకు, "దేవుడు రాహేలును జ్ఞాపకము చేసికొని ఆమె మనవి వినెను" అని కథనము నమోదు చేస్తుంది. ఆమె గర్భము తెరచుట ద్వారాను మరియు తనకు గర్భము దయచేసి బిడ్డకు జన్మనిచ్చులాగున చేయుట ద్వారాను దేవుడు ఈ కార్యమును చేశాడు (30:22). తన సొంత సహజ బిడ్డకు జన్మనిచ్చిన తరువాత, దేవుడు తన ప్రార్థనలు విన్నాడనియు మరియు ఆయన "తన నిందను తొలగించెను" అని ఆమె చెప్పింది. ఆమెకు "మరియొక కుమారుని తనకు దేవుడు దయచేయును గాక" అని ఆశిస్తూ తన కుమారునికి "యోసేపు" అని పేరు పెట్టింది (30:23, 24).

ఈ భాగము ప్రేమింపబడని లేయా మరియు గొడ్రాలైన రాహేలుతో ప్రారంభమైంది (29:31); మరియు ఈ యిద్దరి సహోదరిల మధ్య ద్వేషపూరిత మరియు బాధాకరమైన పోరాటాల నడుమ, అలాగే తప్పుదారి పట్టిన తమ తమ పథకముల నడుమ ఈ కథనము సాగింది. ఈ కథ యొక్క కాల క్రమంలో, దేవుని కృప వలన ఈ ఇద్దరు సహోదరిలు మరియు వారి దాసీలు కూడా బిడ్డలను కన్నారు. ఈ కథనమునకు ముగింపు యోసేపు జననంతో వచ్చింది. దేవుడు తన నిందను తొలగించెను అని రాహేలు సాక్ష్యమివ్వగా, కథకుడు వేదాంతపరమైన ఈ విషయమునకు మన ఆసక్తిని మరల్చుతున్నాడు. ఏదో ఒక సాధారణ సంఘటనగా కాకుండా, ఈ బిడ్డ యొక్క జననము "దేవుడు రాహేలును జ్ఞాపకము చేసికొని ఆమె మనవి వినినందున" (30:22) జరిగినట్లుగా చెప్పాడు.

"జ్ఞాపకము" అనునది వేదాంతపరమైన ఒక అంశము, దీనిలో దేవునికి మరియు తన జ్ఞాపకమునకు పాత్రులైన వారిమధ్య నెలకొన్న క్రియాశీలక నిబంధనా సంబంధము ఇమిడి ఉంటుంది. అబ్రాహాము సొదొమా మరియు గొమొఱ్ఱాలను గూర్చి చేసిన విజ్ఞాపనను దేవుడు జ్ఞాపకము చేసుకున్నప్పుడు ఆ యొర్దాను లోయలోని పట్టణములను నాశనము చేసినప్పుడు "ఆ నాశనము మధ్యన లోతు నివశించకుండా" ఆయనను పంపివేశాడు (19:29). వందల సంవత్సరాల తరువాత, ఇశ్రాయేలీయులు ఐగుప్తీయుల బానిసత్వంలో ఉన్నప్పుడు, వారిని బాధించువారి కొరడా దెబ్బల క్రింద అణగారుతున్నప్పుడు, విడుదల కొరకైన వారి మొరలను "దేవుడు విన్నాడు" మరియు ఆయన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు చేసిన నిబంధనను "జ్ఞాపకము" చేసుకున్నాడు అని వాక్యము చెప్తుంది (నిర్గమ. 2:24). వారిని విడిపించుటకు మోషే ద్వారా నిర్ణయాత్మకంగా క్రియ చేశాడు. నిర్గమమునకు చాలా శతాబ్దాల తరువాత, ఇశ్రాయేలీయులు తమ సొంత దేశమును పోగొట్టుకొని అష్షూరు మరియు బబులోను దేశములలో బానిసలుగా చెదరిపోయారు. వారికున్న ఒకే నిరీక్షణ వారి పక్షమున కార్యము

చేయగలిగే యెహోవా యొక్క విశ్వసనీయమైన జ్ఞాపకముపైనే ఆధారపడి ఉంది (నెహెమ్యా 1:8, 9; యెషయా 49:15, 16). పరిశుద్ధ గ్రంథమంతటిలో, దేవుని జ్ఞాపకము అనునది రక్షణ అనే శుభవార్తకు ఆయువుపట్టుగా ఉంది. దేవుని యొక్క ఎడతెగని ప్రేమ ఆయన మరియు అబ్రాహాముతో చేసిన నిబంధనా వాగ్దానములు ఆఖరుగా యేసుక్రీస్తు ద్వారా నెరవేర్చబడ్డాయి (లూకా 1:67–79; గలతీ. 3:6–8, 16–18, 26–29).

*వ్యతిరేకతలు, మోసాలు, మరియు వెఱ్ఱి పథకములు వేసినప్పటికీ దేవుడు తన కృపలో తన ప్రజలు కనాను దేశమునకు వెళ్లి తన ఆశీర్వాదములను ఆనందించుటకు మార్గము సరాళము చేశాడు.* రాహేలు యోసేపుకు జన్మనిచ్చిన వెంటనే తన కుటుంబముతో కనాను వెళ్లుటకు యాకోబు సిద్ధమయ్యాడు. తన ఇద్దరు భార్యల కొరకు పదునాలుగు సంవత్సరములు కొలువు చేయునట్లు లాబాను యాకోబును మాయ చేశాడు గనుక తన భార్యలతోను మరియు బిడ్డలతోనూ తన "సొంత దేశమునకు" పంపమని తన మామను యాకోబు అడిగాడు (30:25, 26). లాబాను తన అల్లుడి సేవను కోల్పోవాలని అనుకోలేదు, ఎందుకంటే యాకోబు వలన దేవుడు ఆయనను బహుగా ఆశీర్వదించాడని ఆయన గ్రహించాడు. కాబట్టి, తన మేనల్లుడిని జీతముగా ఏమి కావాలో అడగమన్నాడు; కాని, తాను వెచ్చించగలిగే జీతమును యాకోబు కోరలేదు. ధనమునకు బదులుగా, తన కుటుంబము వారు సుదూర ప్రయాణమును కనానుకు చేపట్టుతుండగా తన కుటుంబ అవసరతలను తీర్చుటకును మరియు వారి గమ్యమును చేరిన తరువాత వారికొరకు సొంత నివాసములను నిర్మించుకొనుటకును వీలుగా ఆయన జంతువులను – గొఱ్ఱెలను మరియు మేకలను – తన మామ యొద్ద నుండి అడిగాడు (30:27–30).

చారలైనను పొడలైనను గల ప్రతి గొఱ్ఱెను మరియు నల్లనిదైన ప్రతి గొఱ్ఱెపిల్లను తనకు ఇచ్చిన యెడల లాబానుకు మూడవ సారి కూడా సేవచేయుటకు యాకోబు దాతృత్వముతో కూడిన ఒక ప్రతిపాదనను చేశాడు. దీనికి తోడు, ఆయన చారలైనను మరియు పొడలైనను గల మేకలను కూడా అడిగాడు. బేసి రంగు కలిగిన ఈ జంతువులు తన మామ మందలో కేవలం స్వల్ప శాతమే ఉంటాయి. లాబాను తన అల్లుడి ప్రతిపాదనకు శీఘ్రమే ఒప్పుకున్నాడు ఎందుకంటే ఆయనను మరలా మోసగించి ఈ బేరాన్ని తనకు ప్రయోజనకరంగా మార్చుకోవడం చాలా సులువు అని అనుకున్నాడు.

తన అత్యాశలో, లాబాను ఈ ఒప్పందానికి ఒప్పుకున్నాడు. యాకోబుపై మరింత గొప్ప ప్రయోజనాన్ని పొందుటకు తన మందలోనుండి రంగురంగుల జంతువులను మరియు నల్లని మేకలను తొలగించాడు. బేసి రంగు గల ఈ జంతువులను యాకోబు నుండి మూడు దినముల ప్రయాణమంత దూరము తీసుకెళ్లి తన కుమారుల ఆధీనంలో వాటిని ఉంచాడు. మోసపూరితమైన ఈ

పన్నాగము మరొకసారి లాబాను యొక్క నిజమైన గుణాన్ని బయలుపరుస్తుంది: తన కుమార్తెల యొక్క భర్తను సహితము మోసగించగల అత్యాశపరుడు మరియు కృతజ్ఞతలేని వాడు. లాబానుకు ఈ ప్రణాళిక విఫలము కానొల్లనిదిగా అగుపడి ఉంటుంది. అది తన మేనల్లుడికి రంగులు కలిగిన జంతువులను మాత్రమే ఉంచింది, మరియు ఈ జంతువులు బేసి-రంగు గల అనేక జంతువులను, కనాను దేశమునకు ప్రయాణమైన కుటుంబ పోషణకు సరిపడా మందను ఉత్పత్తి చేస్తాయా అని లాబాను సందేహించాడు. తన అల్లుడిని మరలా మాయ చేసినందుకు మాయగాడైన ఈ మామ తనను తానే అభినందించుకొని ఉంటాడు. యాకోబుకు హారాను విడిచి వెళ్లడం కష్టం చేయాలని అనుకున్నాడు ఎందుకంటే తన మేనల్లుడిని బట్టి దేవుడు ఆయనను దీవిస్తూనే ఉంటాడు అని ఆయన నమ్మాడు గనుక (30:27, 31–36).

యాకోబు ద్వారా దేవుని నుండి ప్రవహించే ఆశీర్వాదములను లాబాను కోరుకున్నాడు కాని, దేవుని మాత్రం కోరుకోలేదు. ఆయన ఆశ ఏమంటే తన అల్లుడి ద్వారా లబ్ది పొంది తన సొంత సంపదను పెంచుకొనుటకు గాను యెహోవాను కూడా ప్రయోజనపరచుకోవాలని అనుకున్నాడు. “దేవుడు వెక్కిరింపబడడు” అనియు “మనుష్యుడు ఏమి విత్తునో, ఆ పంటనే కోయును” (గలతీ. 6:7) అనే పాఠాలను చాలా కష్టంగా నేర్చుకున్నవాడు లాబాను. అధికాధిక సంపదను కూడబెట్టుకొనుటకు అబద్ధములను మరియు కపటోపాయములను నాటుట ద్వారా ఆయన ఆఖరుకు ఓటమిని, అంటే ఎన్నో సంవత్సరాలుగా మోసగించి వంచించిన తన మేనల్లుడి చేతులలోనే కొంతవరకు దారిద్ర్యాన్ని కలిపి, పంటగా కోస్తాడు.

ఏమైనప్పటికీ, యాకోబుకు కూడా ఒక ప్రణాళిక ఉంది, అదే చినారు జంగిసాలు, బాదం, మరియు ఇతర వృక్షాలను తొక్కలు వలిచి వాటిలోని తెల్ల చారలను కనబడేటట్లు చేయడమే ఆయన ప్రణాళిక (30:37). ఆయన వీటిని జంతువుల ముందు నీళ్ల తొట్లలో ఉంచాడు, జంతువులు ఆ నీటిని త్రాగుటకు వచ్చినప్పుడు అక్కడ అవి చూలు కట్టినవి. బలమైన జంతువులు చూలు కట్టినప్పుడు ఆయన తొక్కలు వలిచిన చువ్వలను ఆ నీళ్ల తొట్టిలో ఉంచాడు, అప్పుడు క్రొత్తగా పుట్టిన ఇతర పిల్లల కంటే ఈ జంతువులు బేసి-రంగు సంతానాన్ని ఉత్పత్తి చేశాయి. గొఱ్ఱెలు మరియు పిల్లలు పుట్టినప్పుడు, యాకోబు బేసి-రంగులో ఉన్న జంతువులను తన కొరకు వేరుపరచాడు. మిగతావి అన్ని లాబాను మంద కొరకు ఉంచబడ్డాయి. ఈ విధానమును కొన్ని సంవత్సరాలు ఆచరించిన తరువాత యాకోబు తన మందలను బలమైనవిగా మరియు పొడలు కలిగినవిగా వృద్ధి చేశాడు. ఈలోగా, లాబాను యొక్క మంద పరిమాణములోను మరియు బలములోను కొద్దికొద్దిగా తగ్గుతూ వచ్చాయి. తన మామకు ఇంకా ఆరు సంవత్సరాలు కొలువు చేసిన తరువాత (31:41), ఈ పితరుడు గొప్ప మందలతో, దాసి దాసులతో, వీటికి తోడు ఒంటెలు మరియు గాడిదల తోను బహుగా ఆశీర్వదింపబడ్డాడు (30:37–43).

పశుసంవర్ధక మెళకువలను యాకోబు బాగా ఎరిగిన వాడు గనుక ఆయన

విజయాన్ని పొందాడు అని చాలా మంది సూచిస్తుంటారు. జంతువులు చూలు కట్టేటప్పుడు అవి చూచే రంగు ప్రసవంలో తన బిడ్డల రంగుపై ప్రభావం పడుతుందనే భావనను కొందరు అంగీకరించినట్లుగా ఉంటారు. ఏది ఏమైనప్పటికీ, రాహేలు యొక్క పుత్రదాతవృక్షపు పండ్లు తనకు గర్భధారణలో ఎలా సహాయపడలేదో, అలాగే తోలు వలిచిన యాకోబు యొక్క చువ్వలు తన మంద కొరకు బేసి-రంగులు గల సంతానమును ఉత్పత్తి చేయలేదు. ఈ రెండు కూడా ఫలితములతో సంబంధం ఏమాత్రం లేని మూఢనమ్మకాల ప్రయోగాలు మాత్రమే. యాకోబు యొక్క కార్యములో ఎంచుకున్న సంతానోత్పత్తి విధానాలు కీలకమైన పాత్ర పోషించినప్పటికీ, తనను మోసగించి వంచించాలని అనుకున్న తన మామ కపటోపాయముల నుండి పితరునికి జయాన్ని ఇచ్చింది దేవుడే అని 31:1–13 వచనాలు స్పష్టంగా తెలుపుతున్నాయి. దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానములకు వారసులుగా ఉండునట్లు (12:1–3; 28:13–15) యాకోబు యొక్క సంతతిని ఆశీర్వదించి వృద్ధిపరచుటకు దేవుని ప్రణాళికయై ఉంది. యాకోబు తన తల్లి యొక్క బంధువుల యొద్దకు వెళ్లి అక్కడ పెండ్లాడి తన సొంత కుటుంబమును మరియు మందలను నిర్మించుకొనులాగున ఆయనను అక్కడకు నడిపించుటకు దేవుడు యాకోబు జీవితంలో కలుగజేసుకున్నాడు. లాబాను యొక్క మోసపూరిత ఉపాయములుగాని, యాకోబు మరియు తన భార్యల యొక్క మూఢనమ్మకాల ప్రయోగములు కాని దేవుని ప్రణాళికలు నెరవేర్చబడటాన్ని అడ్డుకోలేవు.

---

సూచనలు

[1]ద్వేషము అనునది ఆదికాండములో మరలా మరలా పునరావృతమయ్యే ఒక అంశం. ఇస్సాకు పట్ల ఫిలిష్తీయులకు ఉన్న భావాన్ని ప్రస్తావించే క్రమంలో (26:14), రాహేలు లేయాపై అసూయ పడినప్పుడు (30:1), యోసేపు అన్నలు ఆయనను చూచి అసూయ పడినప్పుడు (37:11), "ద్వేషించు" అనే క్రియారూపం (קָנָא, *qana'*) ప్రయోగించబడింది. [2]G. Liedke, "דִּין," in *Theological Lexicon of the Old Testament*, trans. Mark E. Biddle, ed. Ernst Jenni and Claus Westermann (Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 1:335–36. [3]32:24, 25లో యాకోబు దూతతో పోరాడినప్పుడు కూడా ఇటువంటి భాషే ప్రయోగించబడింది. [4]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 342. [5]Victor P. Hamilton అనే రచయిత లేయా మాటలను క్రొత్తనిబంధనలోని "నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది. నా ఆత్మ నా రక్షకుడైన దేవునియందు ఆనందించెను ... అన్ని తరములవారు నన్ను ధన్యురాలని యందురు (లూకా 1:46b–48)" అని మరియ పలికిన మాటలతో పోల్చాడు. (Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18—50*, The New International Commentary on the Old Testament [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995], 273.) [6]Kenneth A. Mathews, *Genesis 11:27—50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 486–87. [7]కొన్ని అనువాదములు *zebed*

అనే పదాన్ని “కట్నం”గా అనువదిస్తున్నాయి (ASV; RSV; NRSV; NEB; REB). [8]Willis, 389–90, 431. [9]Paul R. Gilchrist, “יָסַף,” in *TWOT*, 1:385. [10]“నన్ను పంపివేయుము” అనే భావము చాలా సంవత్సరాల క్రితము ఇస్సాకుకు భార్యను తెచ్చుటకు హారాను వెళ్లిన అబ్రాహాము యొక్క దాసునిచే కూడా ప్రయోగించబడింది (24:56).

[11]ఈ ప్రయోగముపై అధిక సమాచారము కొరకు, David E. Aune, “Divination,” in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:971–74 చూడండి. [12]కాపరులు కొన్నిసార్లు ఆ జంతువుల నుండి వచ్చే ఉత్పత్తులచే జీతము చెల్లించబడేవారు, అంటే పాలు మరియు ఉన్ని యొక్క శాతము వంటి ద్వారా. కొన్ని సార్లు వారు నూతనంగా జన్మించిన పిల్లలు కూడా ఇవ్వబడేవారు. [13]నిర్గమకాండము 22:12, 13తో పోల్చండి. ఇది ప్రాచీన పశ్చిమ ఆసియాలోని సుదీర్ఘకాలం ఆచరణలో ఉన్న ఒక ఆచారాన్ని సూచిస్తుంది. ఈ ఆచారం తరువాత కాలంలో మోషే ధర్మశాస్త్రంలో పొందుపరచబడి ఉంటుంది. [14]ఆడుగొర్రె లేదా పొట్టేలును దొంగతనం చేస్తే పరిహారం ఖచ్చితంగా ఎంత చెల్లించాలో ప్రాచీన హారానుకు తెలియదు, కాని హమ్మురాబి అనే చట్టసూత్రం (క్రీ.పూ. పద్దెనిమిదవ శతాబ్దంనకు చెందినది) ఒక పౌరుని నుండి పశువును లేదా గొర్రెను దొంగిలిస్తే ఆ యజమానునికి పదంతలు ఎక్కువ చెల్లించాలి అని చెప్తుంది. (*The Code of Hammurabi* 8, 265). [15]Mathews, 500. [16]Ronald Youngblood, Notes on Genesis, in *The NIV Study Bible*, ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 51–52; see Gordon J. Wenham, *Genesis 16—50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 257. “లాబాను” అను పదమునకు హెబ్రీ పదము “తెల్లని” అనే పదము (לָבָן, *laban*) వంటిదే మరియు “చినారు జంగిసాలు” అనే పదమునకు (לִבְנֶה, *libneh*) సమానమైనదిగా ఉంది. ఈ సమాంతరాలను “ఎదోము” (ఏశావు) మరియు “ఎర్రని” వంటకము అనే పదముల మధ్య గల పదచాతుర్యముతో పోల్చవచ్చును (25:25, 30). [17]Nahum M. Sarna, *Genesis*, The JPS Torah Commentary (Philadelphia: Jewish Publication Society, 1989), 212. [18]John E. Hartley, *Genesis*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 2000), 269–70. [19]ఇతర మనుష్యులతో పట్టణము యొక్క ద్వారము వద్ద కూర్చుని, సమాజమును ప్రభావితం చేసే ప్రాముఖ్యమైన నిర్ణయాలను చేసేది కుమారులు మాత్రమే (రూతు 4:1–6 చూడండి).